నేటి కందం- నేటికి అందం

కురియుచు నానాటి ప్రభను
విరియం జేయుచు ప్రతిభను విన్నాణముతో
చెరగని వీరమును నిలిపి
పరవశమును కొండవీటి పండుగ తెచ్చెన్

(కొండవీటి ఫెస్టివల్ మన సంస్కృతిని మన శౌర్యాన్ని మన ప్రతిభను చాటి ఈతరం ప్రజలకు పరవశం కలిగించింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

నిత్యమేదో రాజకీయ
నినాదాల హోరు
వినిపిస్తెనే జనంలోన
వెలిగేరట జోరు.
తప్పో ఒప్పో ఐతేనేమి
తమకేమిటి పోయేది
ప్రతిపక్షం అధికారం
ప్రతీనేతకు సోయేది

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 11-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:150 పేజీలు:6 వెల: రూ.1/-


## మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు.. కిషన్ రెడ్డి ఫైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు.. మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు.

కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించారు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా.. కిషన్ రెడ్డిదా. అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

## మున్సిపల్ ఎన్నికలు.. భద్రత పెంచామన్న డీజీపీ..

హైదరాబాద్, ఫిబ్రవరి 10: ఫిబ్రవరి 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు 25 వేల మంది పోలీసులతో భారీ భద్రతను ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఓటర్లు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు వేయొచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేస్తామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం.. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రతిపక్షాలు తనకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యే వరకు సభకు దూరంగా ఉండాలని నిర్ణయ ంచుకున్నారు. స్పీకర్‌ను పదవి నుంచి తొలగించేలా తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయానికి వచ్చారు.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దాంతోపాటు ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసినా బీజేపీ ఎంపీపైన చర్యలు చేపట్టకపోవడంపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తి చేస్తున్నది.

## ఫైల్స్ తగలబడ్డాయనేది అవాస్తవం

**-తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 10: ఇటీవలే నాంపల్లి స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో అగ్నిప్రమాదం జరిగిన విషయం విధితమే. అయితే ఈ అగ్నిప్రమాదంపై వస్తున్న వార్తలను తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి కొట్టిపారేశారు. ఈ ప్రమాదంలో కీలకమైన కేసుల ఫైల్స్ కాలిపోయాయనేది పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు.

ఇవాళ ఆయన డీజీపీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మొత్తం 1926 సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్ మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. 1,183 లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు, 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను సిద్ధం చేశామని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి ఫోరెన్సిక్ ఈూఒ అగ్నిప్రమాదంపై విచారణ జరుగుతోందని శివధర్ రెడ్డి వెల్లడించారు. ఓటుకు నోటు కేసు ఫైల్స్ తగలబడ్డాయనేది అవాస్తవమని, ఆ కేసు ఫైల్స్‌ను 2021లోనే కోర్టుకు అందజేశామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు రిపోర్టులూ ఇచ్చామన్నారు. హైప్రొఫైల్ కేసుల సాక్ష్యాధారాలు, డిజిటల్ ఫైల్స్ అన్నీ సురక్షితంగా ఉన్నాయని డీజీపీ వెల్లడించారు.

అగ్నిప్రమాదం కేవలం కంప్యూటర్ సెక్షన్ అండ్ లైబ్రరీ ఉన్న ప్రదేశంలోనే జరిగిందని, సాక్ష్యాలు భద్రపరిచే స్టోర్ రూమ్‌లకు మంటలు వ్యాపించలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో కావాలని తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు.

## మున్సిపల్ ఎన్నికలు... సెలవు ప్రకటించిన సర్కార్..

హైదరాబాద్, ఫిబ్రవరి 10: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేపటి (బుధవారం) పోలింగ్ రోజును సెలవుగా ప్రకటించింది సర్కార్. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది. అంతేకాకుండా, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఈ సెలవు వర్తించనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే ఈ సెలవు వర్తించనుంది.

తెలంగాణ వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. రేపు (ఫిబ్రవరి 11) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయడంతో పాటు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య.. చట్టపరమైన చర్యలకు ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ ..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఎస్టీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సంఘటనను ఎంపీ లక్ష్మణ్ రాజ్యసభలో ప్రస్తావించారు. మహబూబ్‌నగర్‌లో ఇలాంటి దారుణం జరగడం దారుణమన్నారు. 'గెలవడం ఖాయం.. గెలిచిన తర్వాత కూడా నన్ను అధికార పార్టీ వేధిస్తుందని భార్యతో స్పష్టంగా చెప్పి.. ఎస్టీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడు' అని ఎంపీ తెలిపారు.

ఈ దారుణ సంఘటనను సభా ముఖంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు ఎంపీ చెప్పారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ.. ఈ విషయంపై సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసేలా దురాగతాలకు పాల్పడటం తీవ్ర అభ్యంతరకరమని ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

దర్యాప్తు చేస్తున్నాం: డీజీపీ శివధర్ రెడ్డి

మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యపై తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహదేవప్ప సూసైడ్ లెటర్ రాయలేదని, పూర్తి విచారణ జరిపి.. వాస్తవాలు బయటపెడతామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.

## ఇప్పటికైనా నిజాలు చెప్పాలి: కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 10: మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. పులి అవయవాల అక్రమ రవాణా బట్టబయలు..

కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయానికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు.

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరఫున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

## రూ. 700 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా..

హైదరాబాద్, ఫిబ్రవరి 10: నగరంలో భూ ఆక్రమణలపై హైడ్రా (ఊజఆఖీం) దూకుడు కొనసాగుతోంది. గచ్చిబౌలి - కొండాపూర్ ప్రాంతాల్లో సుమారు రూ. 700 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించింది. కొండాపూర్‌లోని జంగంకుంట ఆక్రమణలపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మదీనగూడ మజీద్ బండ వద్ద హైడ్రా ఆపరేషన్ మొదలుపెట్టింది. సుమారు 4 ఎకరాల జంగంకుంటను ఆక్రమణదారులు మాయం చేసినట్లు అధికారులు గుర్తించారు. కబ్జాదారులు సర్వే నంబర్ 134లో మట్టి పోసి కుంటను చదును చేశారు. ఈ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధమయ్యారు. ఈ ఆక్రమణలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేశారు. జంగంకుంటలో రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా టీం.. జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. పోలీసుల సహకారంతో హైడ్రా సిబ్బంది.. కుంట చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. కాగా, హైదరాబాద్‌లో ప్రకృతి వనరులు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు 2024లో హైడ్రా ఏర్పాటైంది.

## బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి దారుణ హత్య.. ఎన్నికలకు మూడు రోజుల ముందు ఘటన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆగడం లేదు. ఇప్పటికే చాలా మందిపై దాడులు జరిగి హత్యకు గురికాగా.. ఇప్పుడు మరో హిందువును బంగ్లాలో దారుణంగా హత్య చేశారు. 62 ఏళ్ల హిందూ వ్యాపారి సుషేన్ చంద్ర సర్కార్‌ను గుర్తు తెలియని దుండగులు దారుణంగా పొడిచి చంపారు. ఈ ఘటన సోమవారం రాత్రి అతడి షాపులోనే జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిమెన్ సింగ్ జిల్లా, దక్షిణకాండ గ్రామానికి చెందిన సుషేన్ చంద్ర సర్కార్, బోగర్ బజార్ ప్రాంతంలో రైస్, ఇతర ఉత్పత్తులు అమ్ముతూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే, సోమవారం రాత్రి అతడు షాపులో ఒంటరిగా ఉండగా గుర్తు తెలియని దుండగులు లోపలికి ప్రవేశించి, షాప్ షట్టర్స్ మూసివేశారు. అనంతరం సర్కార్‌ను కత్తితో అతడిని పొడిచారు. అలాగే షాపులో ఉన్న లక్షల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. రాత్రి ఎంతసేపటికీ అతడు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు అతడికోసం గాలించారు. షాపులోకి వచ్చి చూసేసరికి అతడు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే అతడిని స్థానిక మెడికల్ కాలేజీకి చికిత్స నిమిత్తం తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన సోమవారం రాత్రి 11.00 గంటల సమయంలో జరిగింది.

మృతుడు సుషేన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. తమకు ఎవరితో ఎలాంటి శతృత్వం లేదని అతడి కొడుకు తెలిపాడు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. బంగ్లాదేశ్‌లో వచ్చే గురువారం, ఫిబ్రవరి 12న జాతీయ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అక్కడ హిందువులపై దాడులు తీవ్రంగా జరుగుతున్నాయి. ఎన్నికలకు మూడు రోజుల ముందు తాజాగా హిందువు హత్య జరగడం సంచలనంగా మారింది. ఈ ఘటనలపై అక్కడి హిందువులు, మైనారిటీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


## యూపీలో దారుణం.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సామూహిక ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఉత్తర ప్రదేశ్‌లోని మధురలో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సామూహిక ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతుల్లో ఇద్దరు భార్యాభర్తలు, మిగతా ముగ్గురు వారి పిల్లలు. వీరిలో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుర జిల్లా, కప్పర్‌పూర్ గ్రామానికి చెందిన రైతు మనీష్ కుమార్ (35), అతడి భార్య (32), మైనర్లైన ముగ్గురు పిల్లలు (ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు) ఉన్నారు. వీరి ఇంట్లోని తమ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం అయినా ఇంటి నుంచి ఎవరూ బయటకు రాలేదు.

ముఖ్యంగా పిల్లలు కూడా ఆడుకోవడానికి రాకపోవడంతో మృతుడు మనీష్ సోదరుడు వారి ఇంటికి వెళ్లాడు. స్థానికుల సహాయంతో గోడ దూకి ఇంటిలోపలికి వెళ్లి, తలుపు పగలగొట్టి చూడగా.. ఐదుగురు మరణించి ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఐదుగురి మృతదేహాల్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకున్న ఇంటి గోడలపై ఒక సూసైడ్ లేఖ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# సైన్స్ అండ్ టెక్నాలజీలో అవాంఛనీయ లింగ అసమానతలు !

## (11 ఫిబ్రవరి "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం" సందర్భంగా)

నేటి అత్యాధునిక డిజిటల్-ఏఐ యుగంలో యువత అవకాశాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్తపుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చి వేశాయి. నేటి విద్యావంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నోక్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలోచనలతో సరి కొత్త ప్రపంచాన్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకులు మాత్రమే అధికంగా ఉండడం, మహిళలు/బాలికల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగవలసిన ప్రగతి నమోదు కావడం లేదు. ప్రకృతిలో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్-టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ఈ మధ్య కాలంలో సైన్స్ చదివే బాలికలు, యువతుల సంఖ్య కొంత వరకు పెరిగినా సాధించాల్సింది చాలా ఉందని గమనిస్తూ వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించడం అవసరం అని తెలుసుకోవాలి.

### సైన్స్-టెక్నాలజీలో 33 - 35 శాతం మాత్రమే మహిళలు:

ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేడమ్ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురాలు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపంచ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడానికి, నేటి బాలికలు/యువతులను సైన్స్ వైపు ఆకర్శించడానికి ఐరాస-యూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవాన్ని" పాటించడం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు, తల్లితండ్రులు, పౌర సమాజం, శాస్త్ర సాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు/యువతుల దృష్టిని "స్టెమ్- ఎస్‌టిఈఎం"- సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమాటిక్స్ రంగాల వైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుందని ప్రచారం చేయడం జరగాలి. నేడు 33 శాస్త్రం మహిళా శాస్త్రజ్ఞులు, 35 శాతం బాలికలు/యువతులు స్టెమ్ రంగంలో కొనసాగుతున్నారని, దీనిని 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని పురుషాధిక్య సమాజం బేషరతుగా ఒప్పుకోవాలి.

### సైన్స్-టెక్నాలజీ రంగంలో 'ఆమె' నైపుణ్య గళం విందాం:

సైన్స్-టెక్నాలజీ (స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11 ఫిబ్రవరిన "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం" నిర్వహిస్తున్నారు. 2026 నిర్వహిస్తున్న 'సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తంగా "సైన్స్-టెక్నాలజీ రంగా తలుపులు తెరిచి "ప్రణాళికలు ప్రభావం చూపడం : స్టెమ్ విద్యలో లింగ అసమానతల తగ్గింపు" అనే అంశాన్ని తీసుకొని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. 1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటి వరకు సైన్స్ రంగాల్లో 976 (28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25 మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం. మెడిసిన్ రంగ నోబెల్ బహుమతుల్లో 5.6 శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8 శాతం మహిళలు మాత్రమే ఉండడం సోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి.

నేటి పౌర సమాజం, ముఖ్యంగా పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్‌కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్-టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరిపేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగడం చూద్దాం. సైన్స్-టెక్నాలజీ రంగాలకు బాలికలు, యువతులను ఆకర్షిస్తూ, తగు స్కాలర్‌షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో 'ఆమె' మేథో సంపత్తిని పెట్టుబడిగా పెడదాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జాతీయ క్వాంటం మిషన్ కోసం వ్యూహాత్మక వేదికగా ఆంధ్రప్రదేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర), ఎమ్‌వోఎస్ పీఎంవో, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో అమరావతి క్వాంటం వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమంలో ప్రసంగిస్తూ, "ఇది కేవలం ఒక భవన శంకుస్థాపన మాత్రమే కాదు, ఇది భారత క్వాంటం భవిష్యత్తుకు పునాది రాయి" అని ప్రకటించారు.

క్వాంటం టెక్నాలజీని ఒక ఐచ్ఛికంగా కాకుండా వ్యూహాత్మక అవసరంగా అభివర్ణించిన కేంద్ర మంత్రి... రాబోయే దశాబ్దాల్లో భారత్ తన కమ్యూనికేషన్ వ్యవస్థలు, రక్షణ వ్యవస్థ, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలు, ప్రపంచస్థాయి సాంకేతికతలో తన స్థానాన్ని సురక్షితం చేసుకోవడం కోసం ఈ రంగంలో నాయకత్వమే ఏకైక మార్గమని అన్నారు.

అమరావతి క్వాంటం వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు... రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖా మంత్రి శ్రీ నారా లోకేష్... భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్... శాస్త్ర-సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరండికర్... ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటి... డాక్టర్ అమిత్ సింఘీ (ఐబీఎం రీసెర్చ్ ఇండియా)... డాక్టర్ హారిక్ విన్ (టీసీఎస్)... శ్రీ ఎం.వీ. సతీష్ (ఎల్ అండ్ టీ) సహా ఈ రంగానికి చెందిన సీనియర్ ప్రముఖులు, రాష్ట్ర సీనియర్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శంకుస్థాపన శిలాఫలకాన్ని, అమరావతి క్వాంటం వ్యాలీ లోగోను ఆవిష్కరించడం... ఐబీఎం, టీసీఎస్ క్వాంటం క్లౌడ్ సేవలను ప్రారంభించడం... ఐబీఎం-టీసీఎస్ క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు... క్వాంటం టాలెంట్ హబ్ ప్రకటన... ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం ద్వారా క్వాంటం రిఫరెన్స్ కేంద్రం... క్వాంటం-సేఫ్ అప్లికేషన్స్ కార్యక్రమం... తొమ్మిది మంది పరిశ్రమ భాగస్వాములతో బహుళ అవగాహన ఒప్పందాలపై సంతకాలు... పరిశ్రమ, విద్యాసంస్థలు, ప్రభుత్వాల మధ్య సమన్వయంతో కూడిన భాగస్వామ్యానికి నిదర్శనంగా నిలిచాయి.

ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ఎంతగానో ప్రశంసించారు. ఆయనను "రేపటిలో జీవిస్తూ, ఎల్లుండి గురించి కలలు కనే నాయకుడు"గా కేంద్ర మంత్రి అభివర్ణించారు. హైదరా బాద్‌లోని హై-టెక్ సిటీలో ముఖ్యమంత్రి సాంకేతికత ఆధారిత పాలనను మొదటిసారిగా చూసిన తన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ... గత సంవత్సర కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన వేగవంతమైన పురోగతి సహకార సమాఖ్య స్ఫూర్తిని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్ణించే "డబుల్-ఇంజిన్" విధానాన్ని అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు.

గత వారం విశాఖపట్నంలో తాను పర్యటించిన విషయాన్ని ప్రస్తావించిన కేంద్ర మంత్రి... ఆ సందర్భంలో ప్రారంభించిన ఒక ప్రాజెక్ట్ ఉదాహరణను ఉటంకించారు. 2006లో ప్రతిపాదించి, దాదాపు రెండు దశాబ్దాలుగా నిలిచిపోయిన జాతీయ సముద్ర విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టును ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే పూర్తి చేసిందని ఆయన తెలిపారు. ఇది భారత డీప్ ఓషన్ మిషన్‌కు కీలక కేంద్రంగా పని చేస్తుందనీ, తద్వారా ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి ప్రకటించిన బ్లూ ఎకానమీ దార్శనికతను మరింత బలోపేతం చేస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

ప్రత్యేక జాతీయ క్వాంటం మిషన్ కలిగిన దేశాల సరసన ఈ రోజు భారత్ నిలిచిందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. సుమారు రూ.6,000 కోట్ల కేటాయింపుతో ఈ మిషన్ 17 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 43 సంస్థల్లో విస్తరించి ఉందన్నారు. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెన్సింగ్, మెట్రాలజీ, క్వాంటం మెటీరియల్స్, పరికరాలపై దృష్టి సారించే నాలుగు థీమాటిక్ కేంద్రాల నిర్వహణలో ఇది ఉంటుందని ఆయన తెలిపారు. ఎనిమిది సంవత్సరాల్లోపు 1,000 ఫిజికల్ క్యూబిట్‌లతో క్వాంటం కంప్యూటర్‌లను అభివృద్ధి చేయడం, సురక్షితమైన గ్రౌండ్-టు-గ్రౌండ్ క్వాంటం కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడం, సుదూర క్వాంటం కమ్యూనికేషన్‌ను ప్రారంభించడం, 2,000 కిలోమీటర్లలో ఇంటర్-సిటీ క్వాంటం కీ పంపిణీని సాధించడం జాతీయ లక్ష్యాల్లో భాగంగా ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ, తదుపరి పారిశ్రామిక పరివర్తనకు క్వాంటం టెక్నాలజీ ఎందుకు కేంద్రంగా ఉందో వివరించారు. ప్రత్యర్థులు క్వాంటం కంప్యూటింగ్ సామర్థ్యాలను కలిగి ఉన్న ప్రపంచంలో సాంప్రదాయ కంప్యూటింగ్, సైబర్ భద్రతా వ్యవస్థలు ప్రమాదంలో పడతాయని ఆయన పేర్కొన్నారు. డేటా ఉల్లంఘనను క్వాంటం ఎన్‌క్రిప్షన్ దాదాపు అసాధ్యం చేస్తుందనీ, డీకోడ్ చేయడానికి ఖగోళ కాలపరిమితులు అవసరమని ఆయన వివరించారు. రక్షణ, సైబర్ భద్రతలో ఇది అపూర్వమైన వ్యూహాత్మక రక్షణను అందిస్తుందని తెలిపారు.

ఇతరత్రా అవయవాలకు నష్టం లేకుండా కణితులను మాత్రమే లక్ష్యంగా చేసుకోగల, అవయవ కదలికకు అనుగుణంగా వేగంగా మారగల, రోగి వేగంగా కోలుకోవడానికి వీలు కల్పించే కచ్చితత్వం గల రేడియేషన్ చికిత్సలు సహా పరివర్తనాత్మక ఆరోగ్య సంరక్షణ ఉపయోగాలనూ ఆయన ప్రస్తావించారు. ఉపగ్రహ కమ్యూనికేషన్, సురక్షిత కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు, అధునాతన సెన్సింగ్ సామర్థ్యాలనూ క్వాంటం టెక్నాలజీ పునర్నిర్వచించగలదని ఆయన అన్నారు.

భారత్ కొన్ని దేశాల కంటే ఆలస్యంగా ఐటీ విప్లవంలోకి ప్రవేశించి ఉండవచ్చు... కానీ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో ఆ జాప్యాన్ని పునరావృతం చేయదని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధ, బయోటెక్నాలజీ, అంతరిక్షం, సముద్ర లోతుల అన్వేషణలో సమాంతర మిషన్లతో భారత్ తదుపరి ప్రపంచ సాంకేతిక రంగంలో ముందంజలో ఉందన్నారు. ఇటీవల ప్రకటించిన బయోఫార్మా శక్తి కార్యక్రమాన్నీ ఆయన ప్రస్తావించారు. బయోటెక్నాలజీ, పునరుత్పత్తి, జన్యుశాస్త్రాలు, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థలు, క్వాంటం కంప్యూటింగ్ దిశగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా పురోగమిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

క్వాంటం టెక్నాలజీలో భారత్ ఇప్పటికే బి.టెక్ మైనర్ కోర్సులను ప్రవేశపెట్టిందనీ, ఇప్పుడు ఎం.టెక్ కార్యక్రమాలకూ దానిని విస్తరించడానికి సన్నాహాలు చేస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. శిక్షణ పొందిన అధ్యాపకుల, సంస్థాగత సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణాత్మక క్వాంటం విద్యా కార్యక్రమాలను ప్రారంభించే అవకాశం గురించి ఆయన ముఖ్యమంత్రితో చర్చించారు. అధునాతన ఫ్యాబ్రికేషన్ సౌకర్యాలు, కేంద్ర పరిశోధనా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామనీ... అవి అంకురసంస్థలు, పరిశోధకులు, విద్యా సంస్థలకు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఐఐటీ మద్రాస్ ప్రారంభించిన... ఇప్పుడు దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న... మార్గదర్శక పరిశోధన పార్క్ నమూనానూ ఆయన ప్రశంసించారు.

ఒంటరిగా పనిచేసే యుగం ముగిసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలు, అంకురసంస్థలను ఏకీకృత జాతీయ ప్రయత్నంలో సమగ్రపరచడంలోనే అమరావతి క్వాంటం వ్యాలీ విజయం ఆధారపడి ఉందని తెలిపారు. ఐదు సంవత్సరాల కిందట అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించడం, అణుశక్తిలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించడం సహకార వృద్ధి పట్ల ప్రస్తుత ప్రభుత్వ విశ్వాసాన్ని ప్రదర్శిసాయన్నారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే పాక్షిక వాటా నుంచి 800 కోట్లకు పెరిగిందనీ... ఈ సమగ్ర విధానం కారణంగా రాబోయే సంవత్సరాల్లో ఇది 4500 కోట్లకు చేరుతుందని అంచనాలు చెబుతున్నాయని ఆయన వివరించారు.

కేంద్ర మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ... భారత క్వాంటం ప్రస్థానం పవిత్రమైన అమరావతి నగరం నుంచి ప్రారంభవవుతోందని, వికసిత భారత్ దిశగా భారత్ ప్రస్థానంలో ముందడుగుకు వేదికగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ప్రకటించారు. జాతీయ మిషన్లతో తమ ఆవిష్కరణల వ్యవస్థలను అనుసంధానించే రాష్ట్రాలకు భారత ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందనీ ఆయన హామీ ఇచ్చారు. కేంద్రం-ఆంధ్రప్రదేశ్ మధ్య సహకారం దేశాన్ని ప్రపంచ క్వాంటం రంగంలో అగ్రగామిగా నిలిపే ప్రక్రియను వేగవంతం చేస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ పునరుద్ఘాటించారు.

# సోషల్ మీడియాను మంచి కోసం వాడితే ఇదే ఫలితం

## -సోషల్ మీడియా మంచి కోసం కూడా ఉపయోగపడుతుందన్న సందేశం
## -విద్యార్థులను అభినందించిన కళాశాల యాజమాన్యం
## -టెక్నాలజీ వినియోగంపై ఆలోచింపజేసే సంఘటన




అమరావతి, ఫిబ్రవరి 10: సోషల్ మీడియా.. ప్రస్తుతం ఒక సెన్సేషన్. కొందరికి కాలక్షేపం, మరికొందరికి వ్యసనం. ఇంకొందరికి ఇతరుల వ్యక్తిత్వాన్నికి హని చేసే ఆయుధం. రాజకీయ కక్షలు, మార్ఫింగ్ ఫోటోలు, అసభ్యకర పోస్టులతో సామాజిక మాధ్యమాలు కలుషితమవుతున్న వేళ.. అదే మాధ్యమం ఒక నిండు ప్రాణాన్ని కాపాడేందుకు వారధిగా మారుతుందని అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరూపించారు.

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన సురేష్ కుమార్, పుష్పావతి దంపతుల పది నెలల కుమార్తె పునర్విక 'స్పైనల్ మస్కులర్ అట్రోఫీ' (కండరాల బలహీనత) అనే వ్యాధితో పోరాడుతోంది. ఈ చిన్నారి పరిస్థితిపై సోషల్ మీడియాలో వచ్చిన వార్తలకు ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొూ విద్యార్థులు చలించిపోయి, సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు.

చిరు వేతనం.. భారీ వితరణ

కళాశాలలోని ప్రతి తరగతికి వెళ్లి, తోటి విద్యార్థులకు సమస్యను తెలియపరిచి 7 వేల రూపాయల నగదును సేకరించారు. ఆ మొత్తాన్ని కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఆదినారాయణ చేతుల మీదుగా చిన్నారి తల్లిదండ్రులకు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. దీంతో ఆ విద్యార్థులు చేసిన మంచి పనికి కళాశాల ప్రినిపల్ అభినందించారు.

ఆలోచింపజేసే అంశం:

ప్రస్తుతం విద్యావంతులే సోషల్ మీడియాలో పైశాచికానందానికి పాల్పడుతున్న ఉదంతాలు కోకొల్లలు. సోషల్ మీడియాలో పేరుగుతున్న వ్యతిరేక ధనాలకు చెక్ పెటేందుకు ఆస్ట్రేలియా వంటి దేశాలు 16 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియాను నిషేధించింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో, సోషల్ మీడియాను మనుషుల సమస్యలను పరిష్కరించే వేదికగా మార్చుకోవచ్చని ఉరవకొండ విద్యార్థులు చాటిచెప్పారు. విద్యార్థుల ఈ చొరవను బొూ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ బి. వెంకట రాముడు, పరమేష్ కళాశాల సిబ్బంది అభినందించారు. "టెక్నాలజీని వాడే విధానంలోనే మార్పు ఉందనేది" ఈ విద్యార్థులు నిరూపించిన సత్యం ఈ సంఘటన.

# ప్రజల భద్రతే లక్ష్యం.



కర్నూల్ ఫిబ్రవరి 10: : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆధునిక సాంకేతికతను జోడిస్తూ జిల్లా వ్యాప్తంగా డ్రోన్ పెట్రోలింగ్ ప్రారంభించనున్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళ వారం తెలిపారు. ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ (డిజిపి ఆఫీసు ) నుండి జిల్లా పోలీసు శాఖకు కేటాయించిన 3 నూతన డ్రోన్ కెమెరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. డే విజన్, నైట్ విజన్ డ్రోన్ కెమెరాల ద్వారా పగలు, రాత్రి నిరంతర నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలోని కాలేజ్ లు, స్కూల్స్ వద్ద డ్రోన్ కెమెరాలతో గట్టి నిఘా ఉంచి ఆకతాయిలను గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శక్తి టీమ్ బృందాలతో కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్ కు పాల్పడే వారిని గుర్తించుటకు, బహిరంగ మద్యపానం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ డ్రోన్ల వినియోగం ఎంతో కీలకంగా మారుతుందన్నారు.

డ్రోన్ల ద్వారా నేరాలు అరికట్టడం , చోరీల నివారణ, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన [illegible] సాధ్యమవుతుందన్నారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ఈ డ్రోన్లతో నిఘా ను పటిష్టంగా పని చేయడానికి వీలుంటదన్నారు. ఉత్సవాలు, పండుగలు, వేడుకలు, ట్రాఫిక్ నియంత్రణకు, భారీగా ప్రజలు తరలివచ్చే సందర్భాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు ఈ సాంకేతికత మరింత దోహదపడుతుందన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, స్మార్ట్ పోలీసింగ్ దిశగా జిల్లా పోలీసు శాఖ ముందడుగు వేస్తోందన్నారు. సీసీ కెమెరాల వినియోగంతో పాటు డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాలో ప్రశాంత వాతావరణనీ కొనసాగే విధంగా గట్టి చర్యలు చేపడతామని కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, సైబర్ ల్యాబ్ సిఐ మస్తాన్ వలి, ఆర్ ఐ నారాయణ, సైబర్ ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన సంబంధాల ద్వారా సుస్థిరత, ఆర్థిక వృద్ధి, భద్రత కోసం భారత్ సీషెల్స్ ఉమ్మడి దార్శనికత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 2026 ఫిబ్రవరి 5 నుంచి 10 వరకు సీషెల్స్ దేశాధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మిని భారతదేశంలో పర్యటిసున్నారు.

అధ్యక్షుడు హెర్మిని పదవీ బాధ్యతలు చేపట్టిన సుమారు 100 రోజుల తర్వాత జరుగుతున్న ఈ అధికారిక పర్యటన.. భారత్, సీషెల్స్ మధ్య ఉన్న సుదీర్ఘకాల, బహుముఖ ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయటం, విస్తరించటం, మరింత దృఢంగా మార్చే విషయంలో ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను తెలియజేస్తోంది. సీషెల్స్ స్వాతంత్ర్యం పొంది 50వ వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ.. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంలో ఈ పర్యటన జరగడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.

2026 ఫిబ్రవరి 9న జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి మోదీ, అధ్యక్షుడు హెర్మిని ద్వైపాక్షిక సంబంధాలలోని అన్ని అంశాలపై సమగ్రంగా ఫలప్రదమైన చర్చలు జరిపారు. 2025 అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన డాక్టర్ పాట్రిక్ హెర్మినిని ప్రధానమంత్రి మోదీ అభినందించారు. సన్నిహిత సముద్ర పొరుగు దేశాలుగా ఉన్న భారత్, సీషెల్స్.. చరిత్ర, బంధుత్వంతో ముడిపడి ఉన్న ఒక ప్రత్యేకమైన, కాలానుగుణ పరీక్షలు ఎదుర్కొన్న భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని ఇరువురు నాయకులు అన్నారు. ఇది ప్రజాస్వామ్యం, బహుళత్వ విలువల ద్వారా సామర్థ్యాన్ని పొందుతోందని పునరుద్ఘాటించారు. సీషెల్స్ - భారత్ సంబంధాలు ప్రజా-కేంద్రీకృతమైనవని? పశ్చిమ హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత, స్థిరత్వాన్ని బలపరుస్తాయని నాయకులు అన్నారు. భారతదేశపు 'మహాసాగర్' (అన్ని ప్రాంతాల్లో భద్రత, వృద్ధి కోసం పరస్పర, సమగ్ర పురోగతి) దార్శనికతలో సీషెల్స్‌కు ఒక కీలక పాత్ర ఉందని ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు.

భారత్, సీషెల్స్ మధ్య ఉన్న సుసంపన్నమైన, చారిత్రక ప్రజల మధ్య సంబంధాలను గుర్తు చేసిన ఇరువురు నాయకులు.. సీషెల్స్, భారత ప్రజల భద్రత, శ్రేయస్సు, సంక్షేమాన్ని పెంపొందించడానికి జాతీయ అభివృద్ధి ప్రాధాన్యతలపై మరింత సన్నిహితంగా కలిసి పనిచేయవలసిన అవసరాన్ని ప్రధానంగా చెప్పారు.

సీషెల్స్‌తో పాటు ఈ ప్రాంతానికి భారతదేశం ఒక నమ్మకమైన భాగస్వామి అని అధ్యక్షుడు హెర్మిని స్పష్టం చేశారు. సీషెల్స్ అభివృద్ధి లక్ష్యాలను సాధించటంలో భారత్ సుదీర్ఘకాలంగా అందిస్తున్న సహాయ సహకారాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రెండు దేశాల బలాబలాలతో పాటు ఈ భాగస్వామ్యానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తిస్తున్నట్లు తెలిపిన ఇరువురు నాయకులు.. మెరుగైన సంబంధాల ద్వారా సుస్థిరత, ఆర్థిక వృద్ధి, భద్రత కోసం ఒక ఉమ్మడి దార్శనికతను ప్రకటించారు.

సీషెల్స్, భారత్ మధ్య క్రమబద్ధమైన ఉన్నత స్థాయి రాజకీయ సమావేశాలు, పర్యటనలు, సంప్రదింపుల ప్రాధాన్యతను ఇద్దరు నాయకులు గుర్తించారు. నాయకత్వ, మంత్రిత్వ, ఉన్నతాధికారుల స్థాయిలో రాజకీయ, సామాజిక-ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయటానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

# సీషెల్స్ అధ్యక్షునితో కలిసి సంయుక్త పత్రికా ప్రకటన సందర్భంగా ప్రధాన మంత్రి పత్రికా ప్రకటన పాఠం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: అధ్యక్షుడు శ్రీ హెర్మినీకీ, ఆయన ప్రతినిధి వర్గానికీ భారత్‌లోకి స్వాగతం పలకడం నాకెంతో సంతోషాన్నిస్తోంది.

సీషెల్స్ అధ్యక్షునిగా ఎన్నికవడం పట్ల, 140 కోట్ల మంది భారతీయుల పక్షాన నేను ఆయనకు మనసారా అభినందనలనీ, శుభాకాంక్షలనీ తెలియజేస్తున్నాను.

అధ్యక్షుడు భారత్‌కు రావడం ఇదే మొదటి సారి. సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం, రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న శుభ సందర్భంలో ఆయన భారత్ పర్యటన చోటుచేసుకొంటోంది. ఈ కీలక ఘట్టాలు కలిసికట్టుగా కొత్త శిఖరాలకు చేరుకోవడానికి మనకు స్ఫూర్తిని అందిస్తుంటాయని నేను నమ్ముతున్నాను.

భారత్, సీషెల్స్ సంబంధాలు దౌత్య సంబంధాల కన్నా విస్తృతమైనవి. హిందూ మహాసముద్రం అలలు మన ప్రజల్ని కొన్ని వందల ఏళ్లుగా సంధానిస్తున్నాయి. ఈ సముద్ర తీరం వెంబడి, మన దేశాల మధ్య వాణిజ్యం విస్తరించింది, సంస్కృతులు పెనవేసుకొనిపోయాయి, విశ్వాసం అంతకంతకూ బలోపేతమవుతూనే ఉంది.

భారత్, సీషెల్స్ ఒక్క భౌగోళికంగానే కాకుండా చరిత్ర, నమ్మకం, భవిష్యత్తు పట్ల ఉమ్మడి దృష్టికోణం ద్వారా కూడా అనుబంధితమై ఉన్నాయి.

మన బంధం గతకాలం, వర్తమానంతో పాటు భవిష్యత్కాలానికీ వర్తించేదే. నౌకావాణిజ్య పొరుగుదేశంగా, విశ్వసనీయ భాగస్వామ్య దేశంగా భారత్ అనుసరిస్తున్న 'మహాసాగర్' దార్శనికతలో సీషెల్స్ ఒక అంతర్భాగంగా ఉంది. నౌకా వాణిజ్యంతో పాటు భూ, వాయు రంగాలకు కూడా విస్తరించింది మన సహకారం.

ఈ భాగస్వామ్యాన్ని మరింత బలపరుచుకొనే మార్గాన్ని ఇవాల్టి చర్చల్లో మనం కనుగొన్నాం. మన ఆర్థిక సహకారాన్ని పటిష్ఠపరుచుకోవడానికి కొత్త కొత్త అవకాశాల్ని అన్వేషించాలని ఓ అంగీకారానికి వచ్చాం.

స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని పెంపొందించుకొంటూనే, మనం మన సహకారాన్ని ఫిన్‌టెక్, డిజిటల్ సేవల రంగాలకీ విస్తరించుకొందాం.

అభివృద్ధి ప్రధాన భాగస్వామ్యం భారత్-సీషెల్స్ సంబంధాలకు ఒక బలమైన ఆధారంగా ఉంది. సీషెల్స్ ప్రాధాన్యాలూ, అవసరాలే మా ప్రయత్నాలన్నిటికీ మార్గదర్శకత్వం వహిస్తున్నాయి.

ఈ మార్గంలో ముందుకు సాగుతూ, ఈ రోజు 175 మిలియన్ డాలర్ల విలువైన ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని మేం ప్రకటిస్తున్నాం. ఈ ప్యాకేజీ సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తివిద్య సంబంధిత శిక్షణ, ఆరోగ్యం, రక్షణ, నౌకావాణిజ్య భద్రత వంటి రంగాల్లో నిర్దిష్ట ప్రాజెక్టులకు దన్నుగా ఉంటుంది. ఈ కార్యక్రమాలు సీషెల్స్ ప్రజలకు, ప్రత్యేకించి యువతకు కొత్త ఉపాధి అవకాశాల్నీ, నైపుణ్యాన్ని పెంచుకొనే అవకాశాల్నీ అందిస్తాయి.

భారత ఐటీఈసీ కార్యక్రమం సీషెల్స్‌లో సామర్థ్యాల్ని పెంచడంలో ముఖ్య పాత్రను పోషించింది. సీషెల్స్‌కు చెందిన ప్రభుత్వోద్యోగులకు భారత్‌లో శిక్షణ ఇవ్వడానికి ఒక అవగాహన ఒప్పందంపైన ఈ రోజు సంతకాలవుతున్నాయని తెలియజేస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను.

సాంకేతిక రంగంలో సన్నిహిత సహకారాన్ని అందించుకోవడం ద్వారా, మన భాగస్వామ్యానికి ఒక దూరదర్శి దిశను మనం నిర్దేశిస్తున్నాం. డిజిటల్ పరివర్తనపైన ఓ అవగాహన ఒప్పందాన్ని కూడా ఈ రోజు కుదుర్చుకుంటున్నాం. దీనిలో భాగంగా భారత్‌లో విజయవంతమైన ఫలితాల్ని సీషెల్స్‌తో మేం పంచుకుంటాం.

ఆరోగ్య రంగంలో, సీషెల్స్‌కు భారత్ ఒక స్థిరమైన, విశ్వసనీయమైన భాగస్వామిగా ఉంది. చౌకైన, నాణ్యమైన మందుల సరఫరా, వైద్య పర్యాటకం, ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన.. వీటిలో సీషెల్స్‌తో కలిసి పనిచేయడాన్ని మేం ఇక మీదటా కొనసాగిస్తాం.

ఇంధనం, వాతావరణం రంగాల్లో, మన సహకారానికి స్థిరాభివృద్ధి పట్ల ఉమ్మడి నిబద్ధతే దారిదీపంగా ఉంది. పునరుత్పాదక ఇంధనం, ఆటుపోట్లను ఎదుర్కొని నిలదొక్కుకోవడం, వాతావరణానికి తగిన పరిష్కారాల్ని కనుగొనే విషయాల్లో మన సహకారాన్ని మనం మరింతగా పెంపొందించుకుందాం.

నౌకావాణిజ్య ఇరుగు పొరుగు దేశాలం అయిన మనకు సముద్ర ఉత్పాదనల ప్రధానమైన ఆర్థిక వ్యవస్థ సహజంగానే పరస్పరం సహకరించుకోదగిన రంగాల్లో ఒకటి. నౌకావాణిజ్య సంబంధిత పరిశోధన, సామర్థ్యాల పెంపుదల, సమాచారాన్ని పంచుకోవడం వంటి రంగాల్లో భారత్ అనుభవాన్ని మేం సీషెల్స్‌తో పంచుకుంటాం.

రక్షణ రంగ సహకారం, నౌకావాణిజ్య భద్రత మన భాగస్వామ్యంలో ముఖ్య పాత్రను పోషిస్తున్నాయి. కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌లో పూర్తిస్థాయి సభ్య దేశంగా సీషెల్స్‌ను మేం ఆహ్వానిస్తున్నాం. ఇది మన పరస్పర సమన్వయాన్ని పటిష్ఠపరిచి, హిందూ మహాసముద్రంలో శాంతి, సుస్థిరతల పరిరక్షణ కృషిని బలోపేతం చేస్తుంది.

కలిసికట్టుగా, మనం ఒక్క ద్వైపాక్షిక సహకారాన్నే తీర్చిదిద్దుకోవడం కాకుండా, హిందూ మహాసముద్రం విషయంలోనూ ఉమ్మడి భవిష్యత్తును కూడా సాకారం చేద్దాం.

భారత్ - సీషెల్స్ సంబంధాల్లోని మహత్తర శక్తి మన రెండు దేశాల ప్రజల పరస్పర సంబంధాల్లో ఇమిడి ఉంది. సీషెల్స్‌లో స్థిరపడిన భారతీయులు దేశ సామాజిక, ఆర్థిక స్థితులకు అసాధారణమైన సేవల్ని అందించారు. అదే కాలంలో, వారు మన మైత్రిని తరాల తరబడి బలపరిచారు.

ఇవాళ, మనం పర్యటన, విద్య, సంస్కృతి, క్రీడల రంగాల సాయంతో ఈ సంబంధాల్ని దృఢతరం చేసుకొనే అవకాశాల్ని చర్చించాం. ఇరు దేశాల యువత మధ్య రాకపోకల్ని పెంపొందించే అంశంలో మనం ప్రత్యేక శ్రద్ధ తీసుకొందాం. భారత్-సీషెల్స్ భాగస్వామ్యం ఒక కొత్త దశకు చేరుకొంటోందని ఈ రోజు సమావేశం స్పష్టం చేస్తోంది. అన్ని రంగాల్లో సహకారాన్ని ముందుకు తీసుకు పోవడానికి, భారత్-సీషెల్స్ జాయింట్ విజన్‌ను మనం ప్రకటిస్తున్నాం. ఈ విజన్ రాబోయే కాలంలో మన సహకారానికొక మార్గసూచీగా ఉపయోగపడుతుంది.

# కూటమితో ప్రజలకు ఒరిగిందేమీ లేదు..




శ్రీకాకుళం, ఫిబ్రవరి 10: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కులం, మతం పేరుతో పాలన సాగిస్తూ ప్రజల సంక్షేమానికి గాలికి వదిలేసిందని కేంద్రమాజీ మంత్రి జె.డి.శీలం విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అస్తవ్యస్థంగా మారిపోయిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మతాన్ని పెంచి పోషించే విద్వేషాలకు ఆజ్యం పోస్తూ రాజకీయాలు నడుపుతు న్నారన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని రాష్ట్రంలో కూటమి ఆదర్శంగా తీసుకొని పాలన సాగిస్తున్న వైనాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించేందుకు పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ప్రతి జిల్లాలో పర్యటిస్తూ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని శీలం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అటు జాతీయ స్థాయిలోను, ఇటు రాష్ట్ర స్థాయిలోనూ బలోపేతం అవుతూ ప్రజలకు మరింత చేరువ అవ్వడానికి రాహుల్‌గాంధీ నేతత్వంలో పనిచేస్తున్నదన్నారు. కూటమి పాలనలో ప్రతి జిల్లాలోను ప్రజా ప్రతినిధులు ఇసుక, మద్యం, గనులు దోచుకుంటూ పాలన గాలికి వదిలేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశసమైక్యతకు కషి చేస్తోందని, రానున్నరోజుల్లో అధికారం పొందే దిశగా అడుగులు వేస్తుందని శీలం స్పష్టం చేశారు.

విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పిసిసి ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, డిసిసి అధ్యక్షులు సనపల అన్నాజీరావు, కాంగ్రెస్ నాయకులు పేడాడ పరమేశ్వరరావు, అంబటి కష్ణారావు, రెల్ల సురేష్, కోత మధు సూదనరావు, తెంబూరు మధుసూనదరావు, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకటనాయుడు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, కవిటి గోపాలకష్ణ, ఎం.చక్రవర్తిరెడ్డి, చింతాడ దిలీప్, అంబటి దాలినాయుడు, మంత్రి నరసింహమూర్తి, బస్వా షన్ముఖరావు, లఖినేన నారాయణరావు, బొచ్చు వెంకటరమణ, చింతాడ దిలీప్, కొరాయి ప్రసాద్, ఇజ్జురోతు రమణ, కొత్తకోట్ల సింహాద్రినాయుడు, లక్ష్మి కరిమజ్జి మల్లేశ్వరరావు, లఖినేని సాయిరాం పూడి కిరణ్ కుమార్, ,చాన్ బాషా తంగుడి వీర్రాజు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఇవాళ జరిగిన బస్తర్ పాండమ్-2026 ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఛత్తీస్‌గఢ్‌లో ఇవాళ జరిగిన బస్తర్ పాండమ్-2026 ముగింపు వేడుకలకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి శ్రీ విష్ణు దేవ్‌సాయ్, ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ శర్మ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కొన్నేళ్ల కిందటి వరకు నక్సలైట్ల నీడలో ఉన్న బస్తర్ ప్రాంతంలో మోర్టార్ షెల్స్, తుపాకీ మోతలు, ఐఈడీ పేలుళ్లు గిరిజన సోదరీసోదరులను వణికించేవని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. కానీ నేడు అదే బస్తర్‌లో సుమారు 55 వేల మంది ప్రజలు కలిసి వంటకాలు, పాటలు, నృత్యం, నాటకం, వేషధారణ, సంప్రదాయాలు, అటవీ ఆధారిత వైద్యం వంటి 12 విభాగాలు అంతర్భాగంగా స్థానిక సంస్కృతికి పునరుజ్జీవం పోశారు. ఇది నిజంగా ఒక గొప్ప విజయం.

బస్తర్ సంస్కృతికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పునరుజ్జీవం పోసిందని శ్రీ అమిత్ షా కొనియాడారు. గత బస్తర్ పాండమ్ సందర్భంగా కేవలం 7 విభాగాల్లో పోటీలు నిర్వహించగా, ఈసారి మరో 5 కొత్త విభాగాలను జోడించి గిరిజన, బస్తర్ సంస్కృతిని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి శ్రీ విష్ణు దేవ్‌సాయ్ కృషి చేశారన్నారు. మొత్తం 12 విభాగాల్లో 7 జిల్లాల నుంచి సుమారు 55,000 మంది క్రీడాకారులు, కళాకారులు.. 1,885 గ్రామ పంచాయతీలు, 32 బ్లాక్ ప్రధాన కార్యాలయాల నుంచి పెద్దఎత్తున ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

బస్తర్ ప్రాంత కళలు, సంస్కృతి ప్రపంచంలోని మరే ఇతర గిరిజన ప్రాంతంలోనూ లేవని, వందల ఏళ్ల వరకు మనం వాటిని భద్రపరుచుకోవాలని కేంద్ర హోం మంత్రి అన్నారు. బస్తర్ కళలు, సంస్కృతి, పాటలు, నృత్యాలు కేవలం బస్తర్‌కు మాత్రమే గర్వకారణం కాదని, అవి భారతీయ సంస్కృతి కిరీటంలోని మణిహారాల వంటివని.. బస్తర్ పాండమ్ ఈ గొప్ప వారసత్వాన్ని మరింతగా చాటిచెప్పిందని కొనియాడారు. బస్తర్ తెగలకు తమదైన ప్రత్యేక సంస్కృతి ఉందన్నారు. శ్రీరాముడి కాలం నుంచి తమ సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత ప్రధాన నృత్యాలు జాతీయ స్థాయి గుర్తింపును పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

బస్తర్ సంస్కృతిని జాతీయ స్థాయిలోనే కాక, ప్రపంచ స్థాయికి తీసుకెళ్లటమే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ లక్ష్యమని కేంద్ర హోం, సహకార మంత్రి తెలిపారు. బస్తర్ అంటే బారుద్ కాదని, సుసంపన్నమైన సంస్కృతి, వారసత్వమని అన్నారు. గిరిజన వర్గాల రక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామని, బస్తర్ నృత్యాలు, కళలు, గిరిజన సంస్కృతికి మోదీ ప్రభుత్వం అంతర్జాతీయ గుర్తింపును కల్పిస్తోందని శ్రీ అమిత్ షా తెలిపారు. చరిత్ర అంటే కేవలం పుస్తకాల్లో రాసింది మాత్రమే కాదని, ప్రజల జ్ఞాపకాల్లో సజీవంగా ఉండేదే నిజమైన చరిత్రని ప్రధానమంత్రి మోదీ బలంగా విశ్వసిస్తారని పేర్కొన్నారు.

భగవాన్ బిర్సా ముండా జయంతిని జనజాతీయ గౌరవ దినోత్సవంగా, ఆయన 150వ జయంతి వేడుకలను జనజాతీయ గౌరవ సంవత్సరంగా ప్రకటించటం.. గిరిజన సమాజం పట్ల ప్రధానమంత్రి మోదీకున్న గౌరవానికి నిదర్శనమని శ్రీ అమిత్ షా తెలిపారు. గిరిజన హస్తకళలు, సంస్కృతి, వంటకాలు, అటవీ ఉత్పత్తుల వాణిజ్య వినియోగాన్ని శ్రీ నరేంద్ర మోదీ ప్రోత్సహించారని, సుమారు ఐదు లక్షల అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళల బ్రాండింగ్, మార్కెటింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారని ఆయన వెల్లడించారు.

నారాయణపూర్‌కు చెందిన పండిట్ రామ్ మాండవి, హేమ్‌చంద్ మాంఝీ, కాంకేర్‌కు చెందిన అజయ్ కుమార్ మాండవి, దంతెవాడకు చెందిన భూధారి దాతీ.. కళ, ఆరోగ్యం, విద్యారంగాల్లో చేసిన విశేష కృషికిగానూ పద్మ అవార్డులతో సత్కరించటం ద్వారా దేశవ్యాప్త గుర్తింపు లభించిందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి తెలిపారు. 700లకు పైగా గిరిజన తెగలను గౌరవించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఒక సమగ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గిరిజన నాయకులందరి స్మృతులను చిరస్థాయిగా నిలిచేలా చేసేందుకు రూ.200 కోట్ల వ్యయంతో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటునకు ప్రధానమంత్రి శ్రీకారం చుట్టారని ఆయన వెల్లడించారు.

బస్తర్ పాండమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన భారత రాష్ట్రపతికి కేంద్ర హోం మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ అమిత్ షా.. మొత్తం 12 విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలను రాష్ట్రపతి భవన్‌లో విందుకు ఆహ్వానించాల్సిందిగా కోరగా, రాష్ట్రపతి అంగీకరించినట్లు తెలిపారు. ఈ విజేతలు రాష్ట్రపతి భవన్‌లో తమ కళలను, సంస్కృతిని ప్రదర్శిస్తారని, ఇది వారికి దక్కే గొప్ప గౌరవమని అన్నారు

గిరిజన రైతులు, అమాయక పిల్లలు, మహిళల సంరక్షణే నక్సల్ వ్యతిరేక పోరాట లక్ష్యమని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. నక్సలైట్లు ఐఈడీలను అమర్చేటప్పుడు, వాటిపై గిరిజన రైతులు పొరపాటున కాలు వేస్తే వారు శాశ్వతంగా వికలాంగులయ్యే ప్రమాదం ఉందన్న స్పృహ వారికి లేదా.. ఈ చర్యల వల్ల ఒక అమాయకపు బిడ్డ జీవితం చిన్నాభిన్నం అవుతుందని వారు గ్రహించలేరా.. నక్సలైట్లు ఇంత క్రూరంగా ఎలా ఉంటారు? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధాలను వీడాలని మిగిలిన నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తూ, లొంగిపోయే వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వారికి గౌరవప్రదంగా పునరావాసం కల్పిస్తుందని కేంద్ర హోంమంత్రి భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ ఎంతో ఆకర్షణీయంగా ఉందని శ్రీ అమిత్ షా అన్నారు.

నక్సలైట్లందరూ, తమ కుమార్తెలను పునరావాసం కోసం పంపాలని శ్రీ అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఆ అమ్మాయిలకు ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. భారీ సంఖ్యలో లొంగిపోయిన నక్సలైట్లకు ఎలాంటి హాని జరగదని హామీ ఇచ్చారు. గ్రామాల్లో తూటాలు పేలుస్తూ, పొలాల్లో, రోడ్లపై ఐఈడీ బాంబులు అమర్చుతూ, పాఠశాలలు, ఆస్పత్రులను తగలబెడుతూ, మొబైల్ టవర్లను ధ్వంసం చేసే వారిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఆయుధాలకు ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు.

దేశం ముందు నేడు బస్తర్ ఒక అద్భుతమైన బ్రాండ్‌గా మారిందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి తెలిపారు. 40 ఏళ్లుగా మూతపడిన ఎన్నో పాఠశాలలను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. పాఠశాలలను మూసివేయటం ద్వారా నక్సలైట్లు ఎవరికి ప్రయోజనం చేకూర్చారు అని అక్కడి గిరిజన సోదరీసోదరులను ఆయన ప్రశ్నించారు. దీనివల్ల మన నవతరం ప్రాథమిక విద్యకు దూరమైందన్నారు. వచ్చే ఐదేళ్లలో, అన్ని గిరిజన ప్రాంతాల కంటే బస్తర్ అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారుతుందని, కొత్త పర్యాటక కార్యక్రమాల ద్వారా బస్తర్‌లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని శ్రీ అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. మూసివేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు, పాఠశాలలన్నింటినీ తిరిగి ప్రారంభిస్తామని, అలాగే ఉన్నత పాఠశాలలు, కళాశాలలను కూడా నిర్మిస్తామని చెప్పారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో పోస్టాఫీసులు తెరుచుకుంటున్నాయని, మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని, గ్రామాలను అనుసంధానించే రహదారులను నిర్మిస్తున్నామని వెల్లడించారు. చాలా గ్రామాల్లో నాలుగు దశాబ్దాల తర్వాత జాతీయ జెండా, మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినట్లు కేంద్ర హోంమంత్రి తెలిపారు.

ప్రతి గ్రామానికి అనుసంధానత కల్పిస్తామని, ప్రతి 5 కిలోమీటర్ల పరిధిలో ఒక పోస్టాఫీసు లేదా బ్యాంకు శాఖను ఏర్పాటు చేస్తామని శ్రీ అమిత్ షా తెలిపారు. గిరిజన రైతుల నుంచి ప్రతి క్వింటాలు వరిని రూ.3,100 చొప్పున సేకరిస్తామని, ప్రతి గిరిజన వ్యక్తికి నెలకు 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి గ్యాస్ సిలిండర్లు, కుళాయి కనెక్షన్ల ద్వారా మంచినీటిని అందిస్తామని తెలిపారు.

# శ్రీ రాఘవుడి హుండీ ఆదాయం 3కోట్ల, 8లక్షలు

అమరావతి, ఫిబ్రవరి 10: ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం 3,08,37,571/- వచ్చినట్లు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 21 రోజులకు హుండి లెక్కింపును నిర్వహించారు. భక్తులు కానుక రూపంలో సమర్పించిన హుండీ ఆదాయం కరెన్సీ2,9 8,13, 571/- నాణెములు 10,24 ,000 మొత్తం రూ 3,08,37 ,571 బంగారం (13 గ్రాములు), వెండి1018 గ్రాములు వచ్చినట్లు మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు మఠం సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ అభివృద్ధే అసెంబ్లీ అజెండా..!

**-బడ్జెట్ సమావేశాల్లో విజయవాడ సెంట్రల్ సమస్యలపై పూర్తి దృష్టి**
**-ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు..**
**-ఆటో కార్మికులు, అంగన్వాడీలు, గృహాలు, రహదారులు, కాలుష్య నియంత్రణపై ప్రభుత్వానికి స్పష్టమైన ప్రతిపాదనలు..**
**-అన్ని విషయాలు అసెంబ్లీలో చర్చిస్తాం..**

అమరావతి, ఫిబ్రవరి 10: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలను విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తిస్థాయిలో వినియోగించు కుంటామని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అసెంబ్లీ వేదికను వినియోగిస్తామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి నియోజక వర్గానికి సంబంధించిన ప్రతి కీలక అంశాన్ని తీసుకెళ్తామని తెలిపారు. గత సమావేశాల్లో ఆటో కార్మికుల భవనం, భవన నిర్మాణ కార్మికులు, కాలుష్య నియంత్రణ మండలి వంటి అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి కూడా స్పష్టమైన కార్యాచరణతో సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని వెల్లడించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లపై విధించిన అన్యాయ జరిమానాలు, ఫిట్‌నెస్ ధ్రువపత్రాల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బొండా తెలిపారు. కాలుష్యరహిత విజయవాడ లక్ష్యంగా సీఎన్‌జీ, విద్యుత్ ఆటోలను ప్రోత్సహించే విధానాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువస్తుందని చెప్పారు. దీనివల్ల ఒకవైపు కాలుష్యం తగ్గుతుందని, మరోవైపు కార్మికుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తల జీతాల పెంపు గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే జరిగిందని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుతం వారి న్యాయమైన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తామని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, పని భద్రత, గౌరవ వేతనం వంటి అంశాలపై అసెంబ్లీలో చర్చిస్తామని తెలిపారు.

టిట్కో గృహాలను పూర్తి చేసి ఈ ఏడాది జూలైలోపు లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నగర పరిధిలో కొత్త గృహాల నిర్మాణానికి స్థల సేకరణ, గృహ నిర్మాణానికి బడ్జెట్ పెంపు, కొత్త పెన్షన్ల మంజూరు అంశాలను అసెంబ్లీ వేదికగా లేవనెత్తుతామని తెలిపారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2026 ప్రారంభం

**-సురక్షిత బ్యాంకింగ్ వైపు తొలి అడుగు- కర్నూలులో**
**-పోస్టర్లు, టీవీ కమర్షియల్స్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**
**-రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 13 వరకు కార్యక్రమాలు**
**-సైబర్ మోసాలు, మనీ మ్యూలింగ్ నివారణపై ప్రత్యేక దృష్టి**
**KYC, Re-KYC, C-KYC ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భారత రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్ -?2026 అనగా "ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు" కార్యక్రమాలు ఫిబ్రవరి 13 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల ప్రధాన థీమ్ KYC సురక్షిత బ్యాంకింగ్ వైపు తొలి అడుగు / KYC – Your First Step to Safe Banking" గా నిర్ణయించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, కలెక్టరేట్లో ఈఒచి?2026 పోస్టర్లు ,టీవీ కమర్షియల్స్ ను అధికారికంగా ఆవిష్కరించి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమాల్, జిల్లా పరిషత్ సీఈవో నసరా రెడ్డి, పీడీ డీఆర్డీఏ రమణ రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఒఆఓ) రామచంద్రరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

KYC (నో యువర్ కస్టమర్) అనేది సురక్షిత బ్యాంకింగ్కు పునాది అని, ఖాతాదారుల భద్రత, మోసాల నివారణ, అక్రమ లావాదేవీల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న KYC సంబంధిత మోసాలు, సైబర్ నేరాలు, మనీ మ్యూలింగ్ వంటి అక్రమ కార్యకలాపాల నేపథ్యంలో ఈ థీమ్ అత్యంత అవసరముఅని పేర్కొన్నారు.

# హెల్లెనిక్ రిపబ్లిక్ రక్షణ మంత్రితో న్యూఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిపిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: హెల్లెనిక్ రిపబ్లిక్ రక్షణ మంత్రి నికోలస్ జార్జియోస్ డెండియాస్‌తో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 09 ఫిబ్రవరి 2026న న్యూఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. శాంతి, స్థిరత్వం, స్వేచ్ఛ, పరస్పర గౌరవంపై భారత్-గ్రీస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఆధారపడి ఉందని ఇద్దరు మంత్రులు స్పష్టం చేశారు.

భారతదేశ 'ఆత్మనిర్భర్ భారత్', హెల్లెనిక్ రక్షణ సంస్కరణలు 'అజెండా 2030' మధ్య భాగస్వామ్యం ద్వారా స్వదేశీ రక్షణ పారిశ్రామిక సామర్థ్యాన్ని విస్తరించాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. భారత్, గ్రీస్ మధ్య రక్షణ పారిశ్రామిక సహకార బలోపేతానికి సంతకం చేసిన ఉమ్మడి అంగీకార ఒప్పందం.. ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు కీలకం కానుంది.

ప్రాంతీయ శాంతి, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ఇరుదేశాల రక్షణ మంత్రులు చర్చించారు. ద్వైపాక్షిక రక్షణ సహకారం, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడుతు న్నాయని అంగీకరించారు. ఇరుదేశాల సాయుధ దళాల మధ్య సైనిక కార్యకలాపాల కోసం ద్వైపాక్షిక సైనిక సహకార ప్రణాళిక-2026ను పరస్పరం మార్చుకున్నారు.

పురాతన సముద్రయానం గల రెండు దేశాల మధ్య, వివిధ కీలక సముద్ర వ్యవహారాల్లో ఏకాభిప్రాయాన్ని స్పష్టం చేశారు. గురుగ్రామ్‌లోని ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్-ఇండియన్ ఓషన్ రీజియన్ (ఐఎఫ్‌సీ-ఐఓఆర్)లో ఒక గ్రీక్ అంతర్జాతీయ సమన్వయ అధికారిని నియమిస్తున్నట్లు గ్రీస్ ప్రకటించింది.

సమావేశానికి ముందు, జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు గ్రీస్ రక్షణ మంత్రి నివాళులర్పించారు. అనంతరం, మానెక్ షా సెంటర్‌లో త్రివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

పర్యటనలో భాగంగా హెల్లెనిక్ ప్రతినిధి బృందం బెంగళూరులోని కీలక రక్షణ, పారిశ్రామిక సంస్థలను సందర్శించటమే కాక, న్యూఢిల్లీలోని డీపీఎస్‌యూలు, రక్షణ పరిశ్రమలు, అంకుర సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. ఈ పర్యటన భారత్, హెల్లెనిక్ రిపబ్లిక్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసింది. ఈ బంధం ఇరుదేశాల ప్రజల మధ్య దశాబ్దాలుగా ఉన్న స్నేహపూర్వక, సన్నిహిత సంబంధాలపై ఆధారపడి ఉంది.

# నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**-మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన బందోబస్తు**
**-స్ట్రాంగ్ రూంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**-పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు**
**-సెక్షన్ 144 నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి**
**-డబ్బు, మద్యం పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటాం**
**-పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**



ఘన్‌పూర్, ఫిబ్రవరి 10: ఓటర్లు ఎలాంటి భయం లేకుండా పోలింగ్ రోజున స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ జరుగుతున్న తీరుపై పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌ల భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సజావుగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పోలీస్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నియమాలను ఎవరూ అతిక్రమించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడం చట్ట విరుద్ధమని, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తత అవసరం:**

పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు స్ట్రాంగ్ రూంలకు చేరే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఆదేశించారు. ఎన్నికల బందోబస్తుకు హాజరయ్యే పోలీస్ సిబ్బందికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సెక్షన్ 144 అమల్లో ఉన్న నేపథ్యంలో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అనంతరం పోలింగ్ కేంద్రాల భద్రతపై స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీం శర్మ, సీఐ జి. వేణును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

అనంతరం సీఐ వేణు మాట్లాడుతూ బందోబస్తులో ఒక అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, నలుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 200 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు వినయ్ కుమార్, నవీన్ కుమార్, నరేష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయుర్వేద విద్యలో, ఆరోగ్య సంరక్షణలో రాజస్థాన్ గౌరవాన్విత నాయకత్వానికి ప్రతీక జాతీయ ఆయుర్వేద సంస్థ: ఉప ముఖ్యమంత్రి శ్రీ ప్రేమ్ చంద్ బైర్వా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఆయుర్వేద విద్య, పరిశోధన, ఆరోగ్యసంరక్షణలకు భారత్‌లో ప్రధాన సంస్థ, జైపూర్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ ఆయుర్వేద సంస్థ (ఎన్ఐఏ) ఈ రోజు స్వర్ణోత్సవాన్ని జరుపుకొంది. ఈ సంస్థ గత 50 ఏళ్లుగా ఆయుర్వేద రంగంలో ఉంటూ ప్రజారోగ్యానికి విశేష సేవలందిస్తోంది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖలో సహాయ మంత్రి (స్వతంత్ర), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖలో సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావు జాదవ్, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, ఆయుష్ మంత్రి శ్రీ ప్రేమ్ చంద్ బైర్వాలతో పాటు ఆయుష్ శాఖ ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మొదట 1976లో ఓ ఆయుర్వేద కళాశాలగా ఏర్పాటు చేసినప్పటి నుంచీ, భారత ఆయుర్వేద రంగంలో విద్య, శిక్షణ, పరిశోధన, చేతిరాత ప్రతుల శాస్త్రీయ అధ్యయన రంగాలతో పాటు రోగులకు చెప్పుకోదగిన స్థాయిలో సంరక్షణ సేవల్ని అందిస్తూ, ఈ రంగంలో మొదటి 'డీమ్డ్- టు- బి యూనివర్సిటీ' స్థితికి ఎన్ఐఏ ఎదగడాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ ఎన్ఐఏ స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఈ సంస్థ భారత ప్రాచీన వైద్య విజ్ఞానానికీ, ఆధునిక విజ్ఞానశాస్త్రానికీ ప్రత్యక్ష సేతువుగా ఉందన్నారు. సంస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడమంటే అది ఒక్క కాలం విషయంలోనే కాకుండా, ఆయుర్వేదం పట్ల అంకిత భావంతో కూడిన సేవ, పరిశోధన, ప్రజారోగ్యం పట్ల నిబద్ధతల కొనసాగింపు కూడా అని ఆయన అన్నారు.

రాజస్థాన్ చారిత్రకంగా ఆయుర్వేద పురోగతికి తోడ్పడిందనీ, వైద్యం పరంగా జీవ వైవిధ్యాన్నీ, సాంప్రదాయిక జ్ఞాన వ్యవస్థల్నీ సమృద్ధం చేసిందనీ ముఖ్యమంత్రి తెలిపారు. ఆయుష్ వ్యవస్థలను బలోపేతం చేయడానికీ, ప్రజల మేలు కోరి ఆయుర్వేదాన్నీ, యోగానీ, సాంప్రదాయిక వైద్యాన్నీ ప్రధాన స్రవంతి ఆరోగ్యసంరక్షణ ప్రణాళికతో మిళితం చేయడానికీ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తోందని ఆయన అన్నారు.

విద్యలో, పరిశోధనలో, రోగుల సంరక్షణలో ఎన్ఐఏ దేశానికే నాయకత్వం వహిస్తోందని శ్రీ భజన్ లాల్ శర్మ ప్రశంసించారు. దేశంలో ప్రతిష్ఠాత్మక ఆయుర్వేద సంస్థల్లో ఒకటిగా ఎన్ఐఏ నిలిచిందని ఆయన చెప్పారు. సంస్థలో మౌలిక సదుపాయాలను విస్తరించడానికీ, విద్య పరంగా శ్రేష్ఠత్వాన్ని సాధించడానికీ, రాబోయే కాలాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సంస్థను అభివృద్ధి చేయడానికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సాయాన్నందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

స్వర్ణోత్సవం అంటే సంకల్పాలను పునర్నవీకరించుకొనే సందర్భమని ముఖ్యమంత్రి వర్ణించారు. ఎన్ఐఏను రాబోయే దశాబ్దాల్లో ఆయుర్వేద విద్య, పరిశోధనల్లో గ్లోబల్ సెంటర్‌గా తీర్చిదిద్దాలంటే ఉమ్మడి కృషి ఎంతయినా అవసరమని ఆయన అన్నారు. సంస్థ వారసత్వాన్ని ఉన్నతంగా నిలబెట్టడంలో అమూల్య తోడ్పాటును అందించిన బోధన సిబ్బందినీ, విద్యార్థుల్నీ, పరిశోధకుల్నీ, పూర్వ విద్యార్థుల్నీ ఆయన అభినందించారు. ఎన్ఐఏ 50 సంవత్సరాల ప్రస్థానం ఈ ప్రాచీన విజ్ఞానశాస్త్రాన్ని తరాల తరబడి పరిరక్షించడంతో పాటు ముందుకు తీసుకుపోతున్న ఆయుర్వేద పండితుల, వైద్యుల, పరిశోధకుల తిరుగులేని నిబద్ధతకు అద్దం పడుతోందని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ ప్రతాప్‌రావు జాదవ్ అన్నారు. ఎన్ఐఏ భారత సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ అనుబంధ విస్తారిత వ్యవస్థలో ఓ కీలక సంస్థగా ఉందని ఆయన వర్ణించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఆయుష్ వ్యవస్థలు జాతీయ ఆరోగ్య సంరక్షణ ప్రణాళికలో బలంగా మమేకమయ్యాయని శ్రీ జాదవ్ అన్నారు. కొత్తగా మూడు ఆయుర్వేద విషయాల అఖిల భారత సంస్థల ఏర్పాటు, జాంనగర్‌లో సాంప్రదాయిక వైద్యానికి సంబంధించిన డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సెంటర్ స్థాయి పెంపు వంటి బడ్జెటులో ప్రకటించిన ముఖ్య నిర్ణయాలను గురించి ఆయన ప్రస్తావిస్తూ, ఈ నిర్ణయాలు ఆయుర్వేద రంగ రూపురేఖల్ని గొప్పగా మారుస్తాయన్నారు.

ఆయుష్‌ను ఫలితాలపై ఆధారపడే, శాస్త్రీయంగా చెల్లుబాటయ్యే, ప్రపంచ వ్యాప్తంగా ఆమోదించే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా నిలపాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని మంత్రి ఉద్ఘాటించారు. అడ్వాన్స్‌డ్ రీసర్చ్, డిజిటల్ ఆరోగ్య కార్యక్రమాలు, అంతర్జాతీయ సహకారం, రోగులపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించడం వంటి అంశాల్లో ఎన్ఐఏ వంటి సంస్థలు కీలక పాత్రను పోషిస్తున్నాయని ఆయన అన్నారు.

రాజస్థాన్ ప్రభుత్వం నిరంతరంగా మద్దతు ఇస్తుండడాన్ని శ్రీ జాదవ్ ప్రశంసిస్తూ, సంస్థ విస్తరణకు భూమిని సమకూర్చడంతో పాటు మౌలిక సదుపాయాల పరంగానూ సహకారాన్ని అందించడాన్ని కొనసాగించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎన్ఐఏ ప్రపంచంలోనే సంపూర్ణ వెల్‌నెస్ కూడళ్లలో ఒకటిగా నిలిచి, "హీల్ ఇన్ ఇండియా" దార్శనికతకు తన వంతుగా చెప్పుకోదగ్గ తోడ్పాటును అందించగలుగుతుందన్న నమ్మకం తనకుందని ఆయన అన్నారు.

ఎన్ఐఏ స్వర్ణోత్సవాలు ఒక్క రాజస్థాన్‌కే కాకుండా దేశానికే గర్వకారణమని రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, ఆయుష్ మంత్రి శ్రీ ప్రేమ్ చంద్ బైర్వా అన్నారు. 1976లో ఓ ఆయుర్వేద కళాశాలగా ఉన్న సంస్థ జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపును పొందిన సంస్థ స్థితికి చేరుకోవడం ఈ సంస్థ విద్యారంగ ప్రావీణ్యాన్నీ, సేవాతత్పరతనీ ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు.

ప్రజల్లో ఆరోగ్యాన్ని పెంపొందింపచేయడానికి ఆయుర్వేద, యోగాలతో పాటు సాంప్రదాయిక వైద్యాన్ని కూడా పటిష్ఠపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ బైర్వా పునరుద్ఘాటించారు. ఎన్ఐఏను ఆయుర్వేద విద్య, పరిశోధన, రోగుల సంరక్షణలలో ప్రపంచ శ్రేణి కేంద్రంగా తీర్చిదిద్దడానికి రాజస్థాన్ ప్రభుత్వం నిరంతరాయంగా పూర్తి మద్దతును అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

స్వర్ణోత్సవాల్లో భాగంగా అనేక ముఖ్య కార్యక్రమాలనీ, సదుపాయాలనీ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, కేంద్ర మంత్రి శ్రీ ప్రతాప్ రావు జాదవ్‌లు ప్రారంభించారు. వీటిలో 'ధన్వంతరి ఉపవన్' ప్రారంభ కార్యక్రమం కూడా కలిసి ఉంది. ఔషధ మొక్కలతో కూడిన ఒక తోటయే ఈ ఉపవనం. దీని తరువాత చర్చా కార్యక్రమాల్ని చేపట్టారు. కేంద్ర సహాయ మంత్రి మార్గదర్శకత్వం వహించారు. ఒక కొత్త ఆపరేషన్ థియేటర్ బ్లాకునీ, అడ్వాన్స్‌డ్ సిమ్యులేషన్ ల్యాబొరేటరీనీ కేంద్ర మంత్రి ప్రారంభించారు. వీటితో సంస్థలో వైద్య చికిత్స సంబంధిత శిక్షణ, పరిశోధన సామర్థ్యం, రోగుల సురక్ష విశేషించి మెరుగవుతాయి. అవుట్‌పేషెంట్ సేవల్ని విస్తరించి, రోగుల లభ్యతని మెరుగుపరిచే దృష్టితో కొత్త ఓపీడీ బ్లాకు "సుశ్రుత్ భవన్"ను ప్రారంభించారు. దీనికి అదనంగా, ఎన్ఐఏ పాడ్‌కాస్ట్ స్టూడియో నుంచి ఒకటో అధికారిక పాడ్‌కాస్టును మొదలుపెట్టారు. డిజిటల్ అవుట్ రీచ్, అకాడమిక్ కమ్యూనికేషన్, ప్రజా సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యాలను కేంద్ర మంత్రి తొలి ఎపిసోడ్‌లో వివరించారు.

విద్య, పరిశోధన, రోగులను దయతో సంరక్షించడం ద్వారా ఆయుర్వేదాన్ని పరిరక్షిస్తూ రోజు రోజుకూ మును ముందుకు తీసుకుపోవడానికి అంకిత భావంతో పనిచేస్తున్న ప్రధాన సంస్థగా ఎన్ఐఏ పోషిస్తున్న కీలక పాత్రను స్వర్ణోత్సవ ఘట్టం పునరుద్ఘాటించింది.

# మీపై మీరు నమ్మకముంచండి: ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: తొమ్మిదో ఎడిషన్ పరీక్షా పే చర్చ (పీపీసీ)- 2026 కొనసాగింపులో భాగంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు విద్యార్థులతో సంభాషించారు. పీపీసీ- 2026 రెండో ఎపిసోడ్ సందర్భంగా కోయంబత్తూర్, రాయ్‌పూర్, దేవ్‌మోగ్రా, గువాహటి నగరాలకు చెందిన పరీక్షా యోధులతో ప్రధానమంత్రి ముచ్చటించారు. పరీక్షా పే చర్చ ప్రత్యేక ఎడిషన్‌కు విద్యార్థులను ఆహ్వానిస్తూ.. ఈసారి ఈ కార్యక్రమం దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతోందని శ్రీ మోదీ తెలిపారు. కోయంబత్తూరు ఎడిషన్‌ను ప్రారంభిస్తూ.. తమిళనాడు విద్యార్థుల ఉత్సాహం, ఉత్సుకత తనను ముగ్ధుడిని చేశాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. 'వణక్కం' అని అభివాదం చేస్తూ సరదాగా వారితో ముచ్చటించారు. ప్రధానమంత్రిని చూసినప్పుడు తమ కళ్లను తామే నమ్మలేకపోయామంటూ విద్యార్థులు ఉత్సాహంగా మాట్లాడారు. ప్రధానమంత్రి ఎంతో ఆర్భాటంగా, నాటకీయంగా వస్తారనుకున్నామనీ.. కానీ ఆయన చాలా సాధారణంగా, నిరాడంబరంగా, మనలో ఒకరిగా కనిపించారని వారు చెప్పారు. ప్రధానమంత్రి రాక తమలో ఉత్తేజం నింపిందని ఒక విద్యార్థి చెప్పారు.

చాలా ఏళ్లుగా 'పరీక్షా పే చర్చ' ద్వారా పదో, పన్నెండో తరగతి విద్యార్థులతో తాను ముచ్చటిస్తున్నానని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఇది తాను నేర్చుకునే కార్యక్రమమేగానీ, నేర్పించేది కాదని స్పష్టం చేశారు. తమ ఆలోచనలను పంచుకోవాల్సిందిగా విద్యార్థులను ఆహ్వానించారు.

అంకుర సంస్థల గురించి ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి సమాధానమిచ్చారు. సాంకేతికత ఆవిష్కరణలు కావచ్చు లేదా డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థల వంటి ప్రయోగాత్మక మార్గాలూ కావచ్చు... ముందుగా మనం చేయాలనుకుంటున్న అంశంపై స్పష్టత ఉండాలన్నారు. సాంకేతికత లేదా ఆర్థిక వ్యవహారాల్లో నైపుణ్యం ఉన్న మిత్రులతో కలిసి చిన్న బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. వ్యాపారాన్నో, గొప్ప కార్యాన్నో మొదలుపెట్టేందుకు వయస్సుతో పనిలేదన్నారు. చిన్నచిన్న అంకుర సంస్థలు కూడా సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపగలవన్నారు. నిజంగా ఆసక్తి ఉంటే, అది చాలా మంచి పరిణామమని ప్రధానమంత్రి చెప్పారు. ఇప్పటికే ఉన్న అంకుర సంస్థలను సందర్శించి.. ఒక ప్రాజెక్టు నివేదికను తయారు చేయాలని, దానిని పాఠశాల ప్రాజెక్టుగా నిజాయితీగా సమర్పించాలని ఆయన సూచించారు. దాంతో సరైన మార్గదర్శకత్వం, మద్దతు లభిస్తాయని తెలిపారు. ఈ విధంగా క్రమంగా.. ఎలా ముందుకెళ్లాలన్న అంశమై అమూల్యమైన జ్ఞానం లభిస్తుందన్నారు.

చదువునీ అభిరుచినీ సమన్వయం చేసుకోవడంపై ఓ విద్యార్థి ప్రశ్నకు శ్రీ మోదీ స్పందిస్తూ... రెండూ ఉపయోగకరమేనని, ఒకదానికొకటి తోడ్పడతాయని చెప్పారు. సైన్స్ ప్రయోగాలలో కళను ఉపయోగించడాన్ని ఉదాహరణగా చూపుతూ.. సృజనాత్మకత చదువులో సహాయపడడమే కాకుండా అలసటను తగ్గిస్తుందని ఆయన వివరించారు. చదువుకు ప్రాధాన్యమిస్తూనే.. ప్రతిరోజూ లేదా వారంలో కొంత సమయాన్ని వ్యక్తిగత ఆసక్తుల కోసం కేటాయించాలని సూచించారు.

**వికసిత భారత్, వోకల్ ఫర్ లోకల్‌కు యువత సహకారం**

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలిపే విషయమై ఒక విద్యార్థి అడగగా... చిన్న వయస్సులోనే విద్యార్థులు కూడా ఈ దిశగా ఆలోచించడంపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఒక చిన్న మత్స్యకార గ్రామం నుంచి సింగపూర్ క్రమంగా ఎదిగిన తీరును ఆయన ఈ సందర్భంగా ఉదాహరించారు. అభివృద్ధి చెందిన దేశాలు పాటించే క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అందిపుచ్చుకోవడానికి ఆ దేశ దివంగత నేత లీ కువాన్ యూ ఇచ్చిన ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. చెత్త వేయకుండా ఉండటం, ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఆహార వృథాను అరికట్టడం, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం వంటి చిన్నచిన్న పనులు కూడా దేశ పురోగతికి గణనీయంగా దోహదపడతాయని ఆయన వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యమివ్వడం, వివాహాల వంటి శుభకార్యాలను విదేశాల్లో కాకుండా భారత్‌లోనే చేసుకోవడం... ప్రతి పౌరుడు చేసే ఇలాంటి చిన్నచిన్న పనులన్నీ కలిసి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి దోహదపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద పెద్ద పనుల కన్నా చిన్నచిన్న మార్పులకే ఆయన ఎక్కువ ప్రాధాన్యమివ్వడంపై విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇవే అత్యంత కీలకమైనవని చెప్పడం వారిలో నమ్మకాన్ని కలిగించింది.

స్ఫూర్తి లేదా క్రమశిక్షణ విజయం సాధించాలంటే ఈ రెండింటిలో ఏది ముఖ్యమని ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు శ్రీ మోదీ స్పందిస్తూ.. జీవితంలో రెండూ అత్యావశ్యకమే అన్నారు. క్రమశిక్షణ లేకపోతే కేవలం స్ఫూర్తిని పొందడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని వివరించారు. ఒక రైతు తన పొరుగు రైతు విజయాన్ని చూసి స్ఫూర్తిని పొందినప్పటికీ, వర్షాలకు ముందే తన వ్యవసాయ క్షేత్రాన్ని సిద్ధం చేసుకోకపోతే ఆశించిన ఫలితాలు రావంటూ... ఇందుకోసం ఓ ఉదాహరణను కూడా ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ అత్యావశ్యకమనీ, 'బంగారంతో ఆభరణాలు' చేసినట్టు.. క్రమశిక్షణకు ప్రేరణ బలాన్నిస్తుందనీ ఆయన వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ లేకపోతే ప్రేరణ భారంగా మిగిలిపోతుందనీ, నిరాశను కలిగిస్తుందనీ అన్నారు. ఎన్నో రోజులుగా తనను తొలుస్తున్న ప్రశ్నకు స్పష్టత లభించడం గౌరవంగా భావిస్తున్నట్టు ఓ విద్యార్థి పేర్కొన్నారు.

ఏఐ వికాసం, సద్వినియోగం

కృత్రిమ మేధపై మరో విద్యార్థి ప్రశ్నపై ప్రధానమంత్రి స్పందించారు. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు.. ఇలా ప్రతి కాలంలోనూ కొత్త సాంకేతికతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయనీ, కానీ భయం అవసరం లేదనీ అన్నారు. సాంకేతికత మానవ జీవితానికి యజమాని కాకూడదనీ, పరికరాలకు బానిసలుగా మారొద్దనీ ఆయన హెచ్చరించారు. "నేను దీనికి బానిసను కాను" అని ఆయన దృఢంగా వ్యాఖ్యానించారు. ఏఐని మార్గనిర్దేశం కోసం, పని నాణ్యతను మెరుగుపరచుకోవడం కోసమే ఉపయోగించాలనీ.. నేర్చుకునే ప్రక్రియకు దాన్ని ప్రత్యామ్నాయం కానివ్వొద్దనీ విద్యార్థులకు సూచించారు. ప్రయాణ సదుపాయాలు ఎడ్లబండ్ల నుంచి విమానాల దాకా మారినట్టే.. ఉద్యోగ స్వభావం కూడా ఎప్పుడూ మారుతూంటుందని ఆయన చెప్పారు. సాంకేతికతను అర్థం చేసుకోవడం, స్వీయ సామర్థ్యాలను పెంపొందించుకోవడం, ఆ నైపుణ్యాలను పనిలో ఏకీకృతం చేయడం వల్ల జంకు లేకుండా పురోగమించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

తాము ఎంతో ఉద్వేగానికి లోనయ్యామని, గౌరవంగా భావిస్తున్నామని, ప్రధానమంత్రి తమకు నాయకుడి కంటే కుటుంబసభ్యుడిలా అనిపించారని విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. కోయంబత్తూరులో విద్యార్థులతో ముఖాముఖి ముగింపు సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. కోయంబత్తూరు యువతకు ఏఐ, అంకుర సంస్థలు, భవిష్యత్ సాంకేతికతలపై ఎంతో అవగాహన ఉందని, ఇది భారత యువత ఆలోచనా విధానానికి ప్రతిబింబమని కొనియాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలనే సంకల్పానికి యువతే నూతన బలాన్నిస్తుందని తెలిపారు.

పరీక్షా పే చర్చ స్ఫూర్తిని సంభాషణగా, పరస్పరం నేర్చుకోవటాన్ని కొనసాగిస్తూ, కోయంబత్తూరు నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వరకు ఆ చర్చ ఎలా మారిందో ఆయన స్పష్టం చేశారు. అక్కడ విద్యార్థులతో ఆసక్తికరమైన చర్చలు జరపటమే కాక, స్థానిక వంటకాలనూ ఆయన ఆస్వాదించారు.

అందరికీ "జై జోహార్" అంటూ అభివాదం చేస్తూ, అక్కడి ఆహార సంప్రదాయాలు, స్థానిక రుచుల గురించి ఆయన అడిగారు. అనంతరం ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సెలవుల్లో ప్రయాణాల గురించి అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు సొంత మండలం, జిల్లా, రాష్ట్రాన్ని చుట్టి రావాలని సూచించారు. రైలులో ప్రయాణిస్తూ, ఆహారం తీసుకెళ్లి, విద్యార్థి భారతదేశ వైవిధ్యం గురించి నేర్చుకుంటూ అనుభూతి చెందినప్పుడే పర్యాటకం అత్యంత ఆనందకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

పరీక్షల ఒత్తిడి, మళ్లీ మళ్లీ చదవటం గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు. విద్యార్థులు సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని, ప్రశాంతంగా ఉండాలని, సబ్జెక్టుపై పూర్తిగా పట్టు సాధించటంపై దృష్టి సారించాలన్నారు. నేర్చుకోవటాన్ని క్రీడలతో పోలుస్తూ.. స్థిరమైన సాధన, క్రమశిక్షణ, పోటీతత్వం సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. చదువులో వెనుకబడిన వారితో స్నేహం చేసి, నేర్చుకోవటంలో వారికి సహాయం చేయాలని ఆచరణాత్మక సూచననిచ్చారు.

చదువు, క్రీడలకు సమప్రాధాన్యతనివ్వాలనుకున్న విద్యార్థిని ఉద్దేశించి మాట్లాడుతూ.. చదువు కేవలం వ్యక్తిగత జీవితానికే కాక, సామాజిక జీవితానికి కూడా అవసరమని, దాన్ని తక్కువ అంచనా వేయకూడదని ప్రధానమంత్రి అన్నారు. కేవలం క్రీడల్లో రాణిస్తే చదువు అక్కర్లేదనుకోవటం పొరపాటని ఆయన హెచ్చరించారు. విద్య మాత్రమే సర్వస్వం కాదని కూడా స్పష్టం చేశారు. ప్రతిభను నిరంతరం మెరుగుపరచుకోవాలని చెప్పారు. క్రీడాకారుడిగా ఆటలు ఆడటం ఎంత అవసరమో, నిజ జీవితంలోనూ ఆట అంతే ముఖ్యమని తెలిపారు. జీవితంలో సమతుల్యతకు ఆటలు తప్పనిసరని, "నేను ఆడితేనే, నేను రాణిస్తాను" అని వ్యాఖ్యానించారు. చదువుపైనా దృష్టి సారించాలని, లేదంటే జ్ఞానం లేకపోవటం వల్ల మైదానానికి పరిమితమైన వ్యక్తిగా ఇతరులు భావించే ప్రమాదముందన్నారు. చదువులోనూ, క్రీడల్లోనూ రాణించినప్పుడే అసలైన బలం వస్తుందని స్పష్టం చేశారు. ఆయన సలహాలను పాటిస్తామని చెబుతూ, ఈ అద్భుతమైన అనుభవం పట్ల విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో తమ వంతు సహకారంపై ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. సహజ వనరులను పరిరక్షించుకోవటం వ్యక్తిత్వంలో భాగం కావాలని ప్రధానమంత్రి అన్నారు. రోజూవారీ జీవితంలో మనం పాటించే చిన్న నియమాలే పెద్ద మార్పును తీసుకొస్తాయని చెప్పారు. ఉదాహరణకు బ్రష్ చేసేటప్పుడు కుళాయి నుంచి అనవసరంగా నీటిని వదిలేయకుండా, అవసరం మేరకు వినియోగించుకోవాలన్నారు. దీనికి సంబంధించి ఒక ఉపాధ్యాయుని స్ఫూర్తిదాయకమైన కథను పంచుకున్నారు. ఆ ఉపాధ్యాయుడు.. పెట్రోల్ బంకుల నుంచి ఖాళీ ఆయిల్ డబ్బాలను సేకరించి, విద్యార్థుల ఇళ్లలో మిగిలిపోయిన నీటిని బాటిళ్లలో తీసుకురమ్మని, అలా సేకరించిన నీటిని మొక్కలకు ఉపయోగించేవారు. కూరగాయల వ్యర్థాలను ఎరువుగా మార్చటం ద్వారా పాఠశాల ప్రాంగణం పచ్చదనంతో నిండిపోయింది. ఉపాధ్యాయుడు చేసిన ఈ ప్రయత్నం పర్యావరణాన్ని ఎలా మార్చిందో ఇది చూపిస్తుంది.

భయం లేకుండా ఉండటమే నాయకుడికి ఉండాల్సిన మొదటి లక్షణమని, భవిష్యత్ తరాల నాయకుల నుంచి ఎటువంటి లక్షణాలను ఆశిస్తున్నారని అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి సమాధానమిచ్చారు.

ఇతరుల కోసం ఎదురు చూడకుండా స్వయంగా కార్యాచరణకు పూనుకున్నప్పుడు నాయకత్వం మొదలవుతుందని చెప్పారు. ఉదాహరణకు ఎక్కడైనా పడున్న చెత్తను మనం ముందుగా తీసివేస్తే, ఇతరులు కూడా అనుసరించేందుకు స్ఫూర్తిని పొందుతారని చెప్పారు. నాయకత్వం అంటే ఎన్నికల్లో గెలవటం, ఉపన్యాసాలివ్వటం కాదని, ఎదుటివారికి అర్థమయ్యేలా వివరించి, ఒప్పించగలిగే సామర్థ్యమే అసలైన నాయకత్వమని స్పష్టం చేశారు. ప్రజలకు మార్గనిర్దేశం చేసేముందు, వారిని అర్థం చేసుకున్నవారే నిజమైన నాయకుడని తెలిపారు. ప్రధానమంత్రిని కలవటం ఒక కలలా ఉందని, ఇది ఎంతో అదృష్టమని, గౌరవంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేసిన విద్యార్థులు, అభిమానాన్ని చాటుకున్నారు.

రాయ్‌పూర్ ముఖాముఖిని ముగిస్తూ, పరీక్షల సన్నద్ధత, ఒత్తిడి, అంచనాల వంటివి పరీక్షా పే చర్చలో నిరంతరం చర్చకు వచ్చే అంశాలని, ఈ సమస్యల గురించి యువత బహిరంగంగా చర్చించేలా చేయటమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ప్రధానమంత్రి తెలిపారు. ఈ చర్చలు కేవలం బోర్డు పరీక్షల సన్నద్ధతకు మాత్రమే పరిమితమైనవి కాదని, యువత మనసులో మెదిలే ఆలోచనలను ప్రతిబింబిస్తూ జీవితంలోని ఎన్నో అంశాలను తడుతుందని చెప్పారు. ఈ సంభాషణ తదుపరి భాగం గుజరాత్‌లో జరుగుతుందని, అక్కడ గిరిజన విద్యార్థులడిగిన ప్రశ్నలు తనని ఆశ్చర్యపరిచాయని చెప్పారు.

గుజరాత్‌లోని దేవ్ మోగ్రాలో విద్యార్థులతో సంభాషణ సందర్భంగా వారి నేపథ్యం గురించి ప్రధానమంత్రి తెలుసుకున్నారు. విద్యార్థులు రూపొందించిన కళాఖండాలను ప్రశంసించటమే కాక, గతంలో కలిసిన కొంత మంది విద్యార్థులను గుర్తుపట్టి, వారి స్థైర్యాన్ని అభినందించారు.

గిరిజన ప్రాంతాల్లో పనిచేసేందుకు స్ఫూర్తి ఏంటని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, శ్రీ నరేంద్ర మోదీ పాల్‌చటారియా చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకున్నారు. అక్కడి గిరిజన సమాజం దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో పోరాటం చేసిందని, గతంలో ఆ ప్రాంతంలో తీవ్రమైన కరువు సంభవించినప్పుడు గిరిజనుల పరిస్థితులను గమనించానని, ఆ సమయంలోనే అక్కడ విద్యపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిపారు.

ఉమర్‌గామ్ నుంచి అంబాజీ వరకు ఒకప్పుడు ఒక్క సైన్స్ పాఠశాల కూడా లేదని, నేడు అనేక విశ్వవిద్యాలయాలు, సైన్స్ పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐల ఏర్పాటు వల్ల గణనీయమైన మార్పుతో పాటు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. గిరిజన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు, బడ్జెట్ కేటాయింపులు అవసరమని, వారికి అండగా నిలిచేందుకు పీఎం జన్‌మాన్ యోజనను రూపొందించినట్లు చెప్పారు. విద్య అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. ఉమర్‌గామ్ – అంబాజీ హైవే వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ.. పురోగతికి అనుసంధానత అత్యంత కీలకమని, దానిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

పహల్గామ్ దాడి అనంతర పరిణామాలు, ఆపరేషన్ సింధూర్ వంటి క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కొన్నారని ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి మోదీ సమాధానమిస్తూ.. విద్యార్థులు తరచుగా పరీక్షల సమయంలో ఒత్తిడికి గురవుతారని, పరీక్ష ముగియగానే అది తాత్కాలికమేనని అర్థమవుతుందని అన్నారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించటానికి కేవలం చదవటం మాత్రమే కాక, పేపర్లను సాధన చేయటం, రాయటం అలవాటు చేసుకోవాలని చెప్పారు. నిరంతర సాధన ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. ఉల్లాసంగా ఉండటం అన్నింటికంటే ముఖ్యంగా సరైన నిద్ర ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. గాఢ నిద్ర మెదడును సంతోషంగా ఉంచి, కొత్త ఆలోచనలు రావటానికి, ఉత్సాహంగా ఉండటానికి ఉపయోగపడుతుందని చెప్పారు.

# నిర్వహణ పనితీరు, భద్రత, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా భారీ ప్రాజెక్టులకు భారతీయ రైల్వే ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశవ్యాప్తంగా రైల్వే రద్దీని తగ్గించడం, లైన్ సామర్థ్యాన్ని పెంచడం, భద్రతా వ్యవస్థలను మెరుగు పరచడం, ప్రయాణీకుల, సరుకు రవాణాను మరింత వేగంగా, విశ్వసనీయంగా మార్చే లక్ష్యంతో భారతీయ రైల్వే సమగ్రమైన రైలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదాలు దక్షిణ, ఉత్తర, ఆగ్నేయ రైల్వేల పరిధిలో ఉన్నాయి. వీటిలో లైన్ డబ్లింగ్, మూడు, నాలుగు లైన్లు, బైపాస్ కారిడార్లు, అధునాతన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలు ఉన్నాయి.

జార్ఖండ్‌లోని బార్బెండా-దమ్రుఘుటు డబ్లింగ్, దమ్రుఘుటు-బొకారో స్టీల్ సిటీ మధ్య 3,4వ రైల్వే లైన్ల నిర్మాణాలు, ఆగ్నేయ రైల్వే పరిధిలో చేపట్టనున్న కీలక సామర్థ్య విస్తరణ ప్రాజెక్టులు. ఇవి దేశ ఇంధన, ఖనిజ, సిమెంట్ కారిడార్‌కు కీలకంగా నిలుస్తాయి. ప్రస్తుతం ఈ లైన్ 108 శాతం సామర్థ్య వినియోగంతో పనిచేస్తోంది. దీనివల్ల రైళ్లు 90-150 నిమిషాల పాటు నిలిచిపోతున్నాయి. ప్రతిరోజూ ఈ మార్గంలో 78 రైళు (38 ప్రయాణీకుల, 40 సరుకు రవాణా రైళ్లు) నడుస్తున్నాయి. అలాగే ఏడాదికి సరుకు రవాణా సామర్థ్యం 35.22 మిలియన్ టన్నులుగా ఉంది. ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోకపోతే 2028?29 నాటికి వినియోగం 132 శాతానికి చేరుతుందని అంచనా వేస్తున్నారు.

ఈ ప్రాజెక్టు కేంద్ర బొగ్గు గనులు, సిమెంట్, ఉక్కు కర్మాగారాలు, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డిపో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డిపో, బొకారో స్టీల్ సిటీ పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానాన్ని బలపరుస్తుంది. ఈ విస్తరణ ద్వారా ఇంధన సరాఫరా వ్యవస్థ, పారిశ్రామిక ఉత్పత్తి, జాతీయ సరఫరా వ్యవస్థల సామర్థ్యం గణనీయంగా మెరుగు పడుతుందని భావిస్తున్నారు.

రైల్వే భద్రతను, కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కవచ్ వ్యవస్థను అమలు చేస్తున్న ఉత్తర రైల్వే మార్గాల్లోని 34 స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ (ఈఐ) వ్యవస్థను అమలు చేయడానికి భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ఢిల్లీ డివిజన్‌లోని 21 స్టేషన్లకు రూ. 292.24 కోట్లు, అంబాలా డివిజన్‌లోని 13 స్టేషన్లకు రూ. 129.17 కోట్లు కేటాయించింది.

ఈ ఆధునీకరణ ద్వారా రైళ్ల రాకపోకలు వేగంగా, సురక్షితంగా సాగుతాయి. సిగ్నలింగ్ వ్యవస్థల విశ్వసనీయత పెరుగుతుంది. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో మరిన్ని రైళ్లను నడపడానికి వీలవుతుంది. అలాగే ఆధునిక రైలు రక్షణ వ్యవస్థలతో సమన్వయం మరింత మెరుగుపడుతుంది.

రాజ్‌పురా బైపాస్ లైన్, ఉత్తర రైల్వే: రూ. 411.96 కోట్లు

ఉత్తర రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే అంబాలా-జలంధర్ విభాగంలో సామర్థ్యాన్ని, పనితీరును మెరుగుపరచడానికి రాజ్‌పురా బైపాస్ లైన్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు ద్వారా న్యూ శంభూ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డీఎఫ్‌సీ) స్టేషన్ నుంచి రాజ్‌పురా-బటిండా లైన్‌లోని కౌలి స్టేషన్ వరకు రైలు అనుసంధానం ఏర్పడుతుంది. దీంతో సరుకు రైళ్లు రద్దీగా ఉండే రాజ్‌పురా యార్డ్‌ను దాటుకుని వెళ్లగలుగుతాయి. ఇది సరుకు రవాణాను సులభతరం చేస్తుంది. ప్రస్తుతం ఉన్న రైలు లైను మార్గాలపై ఒత్తిడి తగ్గుతుంది. భవిష్యత్తులో పెరిగే ట్రాఫిక్ అవసరాలను సమర్థంగా నిర్వహించడంలో సహాయ పడుతుంది. అంతేకాకుండా డీఎఫ్‌సీతో మెరుగైన అనుసంధానం కల్పించి, ఈ ప్రాంతంలో ప్రయాణికుల, సరుకు రవాణా మరింత నమ్మకంగా, సజావుగా సాగేందుకు దోహదపడుతుంది.

ఆలప్పుజా-అంబలపుజా రైల్వే లైన్ డబ్లింగ్ (12.66 కి.మీ): రూ. 324.16 కోట్లు

ఎర్నాకులం-తురవూరు-కాయంకుళం మార్గంలో ఉన్న కీలకమైన సింగిల్ లైన్ అడ్డంకిని తొలగించడానికి ఈ వ్యూహాత్మక ప్రాజెక్టు అత్యంత ముఖ్యమైనది. ఇది పూర్తయిన తర్వాత ప్రతి దిశలో రోజుకు 9 అదనపు ప్యాసింజర్ రైళ్లను నడపడానికి వీలవుతుంది. ఏడాదికి 2.88 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుంది. రైల్వేకు ఏడాదికి రూ. 3.23 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుంది. ప్యాసింజర్, సరుకు రవాణా రైళ్లు నిలిపివేత తగ్గి, కార్యకలాపాల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది.

ఈ కారిడార్‌లో మిగిలి ఉన్న చివరి సింగిల్ లైన్ విభాగాన్ని పూర్తి చేయడం ద్వారా రైళ్ల రాకపోకలు నిరంతరాయంగా, సాఫీగా సాగుతాయి. ఇది కేరళలో అంతరాష్ట్ర సరుకు రవాణాను బలోపేతం చేయడమే కాకుండా, ప్రధాన జంక్షన్ల వద్ద రద్దీని తగ్గించి, సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు వేగవంతమైన, నమ్మదగిన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది.

పాలక్కాడ్ టౌన్..పార్లీ బైపాస్ లైన్ (1.80 కి.మీ):రూ. 163.57 కోట్లు

కేరళలోని పాలక్కాడ్ జంక్షన్ వద్ద అనేక రైళ్లకు అవసరమైన ఇంజిన్ దిశ మార్చే ప్రక్రియను తొలగించడం ద్వారా పాలక్కాడ్ బైపాస్ ప్రాజెక్టు తక్షణ కార్యాచరణ, ప్రయాణికుల ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ప్రాజెక్టు అమలుతో ప్యాసింజర్ రైళ్ల నిలిపివేత సమయం సగటున 40-44 నిమిషాలు, సరుకు రవాణా రైళ్ల నిలిపివేత సమయం ప్రతి రైలుకు 120 నిమిషాల వరకు తగ్గుతుంది. పాలక్కాడ్ జంక్షన్ నుంచి భవిష్యత్తులో ప్రవేశపెట్టబోయే మరిన్ని ప్యాసింజర్ సర్వీసులకు ఇది మద్దతుగా నిలుస్తుంది.

రైళ్ల రాకపోకలను క్రమబద్ధీకరించడం ద్వారా షోరనూర్, తిరువనంతపురం, పొల్లాచ్చి మార్గాల్లో రైళ్ల సమయపాలన గణనీయంగా మెరుగుపడుతుంది. దక్షిణ రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే జంక్షన్లలో ఒకటైన పాలక్కాడ్‌లో రద్దీని ఇది తగ్గి వేగవంతమైన రైలు రాకపోకలకు మార్గం ఏర్పడుతుంది.

ఇరుగూర్-పోదనూర్ డబ్లింగ్ (10.77 కి.మీ): రూ. 277.42 కోట్లు

తమిళనాడుకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి పనుల్లో ఒకటిగా చెన్నై?తిరువనంతపురం కారిడార్‌లో కీలక ఇరుగూర్?పోదనూర్ విభాగాన్ని డబ్లింగ్ చేయుడానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు అమలుతో రోజుకు అదనంగా 15 ప్రయాణికుల రైళ్లు నడిపే అవకాశం ఏర్పడుతుంది. అలాగే సంవత్సరానికి 3.12 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుంది. దీని ద్వారా వార్షిక నికర ఆదాయం రూ. 11.77 కోట్లు పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం ఈ విభాగంలో లైన్ సామర్థ్య వినియోగం 60 శాతంగా ఉంది. అయితే ఈ విస్తరణ పూర్తయిన తర్వాత 2027?28 నాటికి ఇది 131 శాతానికి చేరుతుందని అంచనా వేశారు. ఇది ఈ ప్రాజెక్టు అత్యవసరాన్ని తెలుపుతుంది. ఇప్పటికే సమీప విభాగాల్లో ఇప్పటికే పూర్తయిన లేదా జరుగుతున్నలేదా అమలులో ఉన్న నాలుగు లైన్ల విస్తరణ పనులతో కలిపి ఇరుగూర్- పోదనూర్ డబ్లింగ్ పూర్తయితే మొత్తం చెన్నై-కోయంబత్తూర్-పోదనూర్ మార్గం ఒక అధిక సామర్థ్యంతో కూడిన నాలుగు లైన్ల కారిడార్‌గా మారనుంది. ఇది కోయంబత్తూర్ వంటి ప్రధాన పారిశ్రామిక కేంద్రాలకు ప్రత్యక్ష లాభం చేకూర్చడమే కాకుండా.. పోదనూర్ టెర్మినల్‌లో కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుంది. ఉత్తరాది ప్రాంతాలకు కొత్త రైలు సేవలను ప్రారంభించడానికి తోడ్పడుతుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందించడానికి భారతీయ రైల్వే పూర్తిగా సిద్ధంగా ఉందనే విషయాన్ని ఈ ఆమోదాలు పునరుద్ఘాటిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో సహకారం అందితే ఈ ప్రాజెక్టులు వేగవంతమైన ప్రయాణాలకు, అధిక సరుకు రవాణా సామర్థ్యానికి, మెరుగైన భద్రతకు, స్థిరమైన ఆర్థిక వృద్ధికి దారితీస్తాయి.

## మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

ఆసిఫాబాద్ ఫిబ్రవరి 10: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని జెండ గూడ గ్రామపంచాయతీ లోని అలీగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.2 లక్షలతో మంజూరు అయిన మరుగుదొడ్ల నిర్మాణానికి మంగళవారం జెండగూడ సర్పంచ్ ఉయిక చందన్ షావ్ భూమి పూజ చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందన్ షావ్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా మరుగుదొడ్ల అవసరం ఎంతో ముఖ్యమని, ఇవి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్యాభివృద్ధికిదోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ డివిజన్ పంచాయతీ రాజ్ డిఈ ఫ జల్వాక్, అసిస్టెంట్ బాబూలాల్ జెండగూడ ఉపసర్పంచ్ ఎస్.కే. ఆజమ్, గ్రామస్థులు యాదోరావు, మాణిక్ రావు, గోవింద్ రావు గ్రామపంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెయ్యి నుంచి మూడు వేల పెన్షన్ నెలనెలా

### -యూనియన్ బ్యాంక్ మేనేజర్ మోహనరావు




ఆదిలాబాద్, ఫిబ్రవరి 10: 18 నుంచి 40 ఏళ్ళ వయస్సు మధ్య ఉన్న వారు నెలనెల పెన్షన్ పొందెందుకు యూనియన్ బ్యాంకు అందించే అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరాలని బ్యాంకు మేనేజర్ మోహనరావు కోరారు. కేవైసీ అప్డేట్ విధానం పై బ్యాంకు ఖాతాదారుల సమావేశం వేంసూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల కొరకు సుకన్య సమృద్ధి యోజన పథకం, ఇన్సూరెన్స్ పథకాల కొరకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన వంటి పథకాలను రూ.20 నుంచి 436 రూపాయలు సంవత్సరానికి చెల్లించటం ద్వారా రెండు లక్షలు ఇన్సూరెన్స్ పొందవచ్చు అన్నారు.

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలకు ఇతరులకు చెప్పవద్దని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ళు రకరకాల పద్ధతులలో బ్యాంక్ ఖాతాదారులను మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పక్రుద్దీన్ ఆలీ అహ్మద్, కార్యదర్శి కిషోర్ బాబు, ఐకెపి ఎపిఎం సుబ్బారావు, వార్డు సభ్యులు, ఐకెపి సిబ్బంది, డ్వాక్రా మహిళలు, బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ ఖాతాదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల విశ్వాసం పెంచాలి : కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ఖమ్మం, ఫిబ్రవరి 10: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల విశ్వాసం పెంచాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఇల్లెందు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఔషధాల పంపిణీ విభాగం, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డులు, గర్భిణీల వార్డు, గైనిక్ వార్డు, ఎక్స్‌రే గది, స్టోర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో ఉన్న సదుపాయాలు, నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇన్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు సేకరించారు.

ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బర్త్ వెయిటింగ్ రూమ్‌ను సందర్శించిన కలెక్టర్ మిగిలిన పనులను వేగవంతం చేసి తక్షణమే ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల మేడారం జాతర ముగిసిన నేపథ్యంలో జాతర అనంతరం ఇన్ఫెక్షన్లు, జ్వరాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను కట్టుదిట్టంగా పాటించాలని సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహిస్తూ అవసరమైన మందుల నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు, సిబ్బంది 24 గంటల పాటు సేవలకు సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య సామాగ్రి, మరమ్మతులు, పరికరాల రిన్యూవల్‌కు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఆర్ఎంఓ రామ్ నివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ జయ, హెడ్ నర్స్ ఫర్ జానా, నర్సులు భవాని, భారతి, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ బి.చంద్రశేఖర్




నల్లగొండ, ఫిబ్రవరి 10 : మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్ర శేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలో ఏర్పాటు చేసిన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా సిబ్బందితో మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, అన్ని విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పిఓ డైరీ జాగ్రత్తగా రాయాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 6:45 గంటలకు ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ను తెరవడం చేయాలన్నారు.

అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఈ నెల 11న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జిల్లాలోని 6 మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, 161 వార్డులకు సంబంధించి 473 పోలింగ్ కేంద్రాలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుందని, హాలియా మున్సిపాలిటీలోని 10వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందుకుగాను ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఓటరు చీటీలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించడంతో పాటు, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని, డీఆర్సీ కేంద్రాల ద్వారా పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

### పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు

మున్సిపల్ ఎన్నికలకు 2,855 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోవడం జరుగుతున్నదని, వీరందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. డీఆర్సీ కేంద్రాల నుండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి బస్సులు ఏర్పాటు చేసి పంపిస్తున్నట్లు చెప్పారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించామని, గత మున్సిపల్ ఎన్నికల్లో 79.5% ఓట్లు పోల్ కాగా, ఇటీవలి గ్రామ పంచా యతీ ఎన్నికల్లో 89% ఓట్లు పోలయ్యాయని, పోలింగ్ ను పెంచేందుకు గాను అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఆడియో క్లిప్ ద్వారా ఓటు వేసే విధంగా అవగాహన కల్పిస్తున్నామని, ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేసేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

### ఓట్ల లెక్కింపు కేంద్రాలు

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి ఆర్జాలబావి వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, దేవరకొండ, చండూరు, చిట్యాల మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఎస్ఎల్‌బీసీ సమీపంలో ఉన్న సోషల్ వెల్‌ఫేర్ బాలిక రెసిడెన్షియల్ పాఠశాలలో, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హాలియా మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మిర్యాలగూడ అవంతిపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికల ప్రచారం ముగిసినందున ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, వి ఎస్ టి బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయని, ఎక్కడైనా డబ్బు, మద్యం పంపిణీ జరుగుతున్నట్లయితే తక్షణమే స్పందించి సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులను జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ ఓటర్లు అందరూ వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకులను వేధించిన ఏ ఒక్కరిని వదిలిపెట్టం : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ , ఫిబ్రవరి 10: రాష్ట్రంలో సామాన్యులు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి లేదు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది పోలీసులు అధికార పార్టీకి సహకరిస్తూ బీఆర్ఎస్ నాయకులును వేధిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జిల్లా కేంద్రంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అధికారులు పని చేయాల్సి ఉంటుంది కానీ,

పోలీస్ డిపార్ట్‌మెంటే మొత్తం నడిపిస్తుందని ఆరోపించారు. పోలీసు శాఖ వ్యవహారం చూస్తే సిగ్గు అనిపిస్తుంద్నారు. ఎన్నికల రూల్స్ అందరికి ఒకేలా ఉండాలి. కానీ బీఆర్ఎస్ అభ్యర్థులకే రూల్స్ వర్తిస్తున్నాయని తెలిపారు. పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సీఎం సొంత జిల్లాలోనే అరాచకాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డబ్బు, మద్యం పంపిణీకి పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపించాఉ. ఎన్నికలే లేకుండా పోలీసులు అందరినీ విత్ డ్రా చేయిస్తే అయిపోయేదిగా! అని ఎద్దేవా చేశారు. ఎన్నికల అధికారులకు ఫోన్ చేస్తే మాకు సంబంధం లేదన్నట్టు ఉంటున్నారు. అందరూ అభ్యర్థులను సమానంగా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

## మున్సిపల్ పోలింగ్‌కు సర్వం సిద్ధం : ఆర్డీఓ సూర్యనారాయణ




నల్గొండ, ఫిబ్రవరి 10: కోదాడ పట్టణంలోని సీసీఆర్ విద్యా నిలయం పంపిణీ కేంద్రం నుండి ఎన్నికల అధికారులు మంగళవారం పోలింగ్ సామగ్రిని ఆయా కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 491 మంది సిబ్బంది పీఓ, ఏపీఓ, ఓపీఓ విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన బూత్‌లకు చేరుకున్నట్లు చెప్పారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సుమారు 200 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# అజరామరం ఆ గానం

**ఫిబ్రవరి 11... ఘంటసాల వర్ధంతి**



భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించుకున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయుని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘ వాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరోలకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారం గ్రహించారు. 71లో ఐరోపా, అమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్తులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుడే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలా వాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవ కుశ, నర్తనశాల, ఒకటేమిటి పాడిన పాట లెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరా మర సుస్వరా న్ని కలిగిన ఘంట సాలను అనుని త్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.



–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# దుబాయ్ లో చిక్కుకున్న భారత వలస కార్మికుల విషయాన్ని సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల సంఘం

**–జార్ఖండ్ లోని మూడు జిల్లాలకు చెందిన కార్మికుల పాస్ పోర్టు స్వాధీనం..**
**–జీతాలు ఇవ్వకుండా... భారత్ కు తిరిగి రాకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు**
**––రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వలస కార్మికుల కంట్రోల్ రూం అధిపతికి నోటీసులు జారీ..**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: జార్ఖండ్ లోని గిరిదీ, హజారీబాగ్, బొకారో జిల్లాలకు చెందిన 14 మంది వలస కార్మికులు దుబాయ్ లో చిక్కుకుపోయినట్లు మీడియాలో వచ్చిన కథనంపై జాతీయ మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. ఈ కేసును కమిషన్ సుయోటోగా స్వీకరించింది. ట్రాన్స్‌మిషన్ లైన్ పనుల్లో నిమగ్నమైన ఒక సంస్థ ఈ కార్మికులను ఉద్యోగంలో తీసుకొని, వారు తిరిగి స్వదేశానికి వెళ్లకుండా అడ్డుకోవడానికి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుంది. అంతేకాకుండా వారికి వేతనాలను చెల్లించడం లేదని సమాచారం. ఈ పరిస్థితుల నేపథ్యంలో తమను సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలంటూ బాధిత కార్మికులు జార్ఖండ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ వార్తా కథనంలోని విషయాలు నిజమైతే.. అవి తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తాయని కమిషన్ అభిప్రాయపడింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక సమర్పించాలని జార్ఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వలస కార్మికుల సమాచార కేంద్రం (ఎండబ్ల్యూసీఆర్) అధిపతికి నోటీసులు జారీ చేసింది.

2026 ఫిబ్రవరి 3 ప్రచురితమైన మీడియా నివేదిక ప్రకారం.. భారత్ నుంచి దుబాయ్‌కు విమాన టిక్కెట్ల కోసం అయిన ఖర్చును వసూలు చేసేందుకు సంబంధిత కంపెనీ కార్మికుల జీతంలో ఎక్కువ భాగం కోత విధించిందని అక్కడ చిక్కుకున్న ఒక కార్మికుడు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వసతికి కూడా సంస్థ డబ్బులు వసూలు చేస్తోందని, చివరకు ఆహారం కొనుక్కోవడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవని వారు ఫిర్యాదు చేశారు.

# స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి : సీపీ సునీల్ దత్




ఖమ్మం, ఫిబ్రవరి 10 : ఖమ్మం జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పని చేయాలని సిబ్బందికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై, ఏదులాపురం మున్సిపాలిటీ సంబందించి ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాల న్నారు.


శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా ఉండాలని, అప్పగించిన భాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లవద్దని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్జ్ టీమ్స్, చెక్ పోస్టులు, రూట్ మొబైల్ పార్టీలు, ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా పోలింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐదు మున్సిపాలిటీలలో 11 వందల మంది పోలీస్ సిబ్బంది (అడిషనల్ డీసీపీలు -04, ఏసీపీలు -08, సిఐలు- 25, ఎస్ఐలు- 80, పోలీస్ సిబ్బంది -975) పాల్గొంటున్నారని అన్నారు. ఎక్కడ కూడా ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, ఏసీపీ తిరుపతి రెడ్డి, నర్సయ్య, రూరల్ డివిజన్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# రూ. 16.10 లక్షల కోట్ల విలువైన 352 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అంచనా వేసిన పీఎం గతిశక్తి నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశంలో మౌలిక సదుపాయాల ప్రణాళిక, అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే ఉద్దేశంతో పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ (పీఎంజీఎస్ ఎన్ఎంపీ) అక్టోబర్ 2021లో ప్రారంభించారు. పీఎం గతిశక్తి వ్యవస్థ కింద ఏర్పాటు చేసిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్ పీజీ).. కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమగ్రంగా పరిశీలిస్తుంది. సమీకృత ప్రణాళిక, మల్టీమోడాలిటీ, ఇంటర్–మోడాలిటీ, వివిధ శాఖల ప్రయత్నాల సమన్వయం, చివరి మైలు కనెక్టివిటీ, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి, డేటా ఆధారిత నిర్ణయాలు వంటి అంశాలను చేపట్టడం ఈ గ్రూప్ ప్రధాన బాధ్యత. ఇప్పటి వరకు సుమారు రూ. 16.10 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 352 మౌలిక సదుపా యాల ప్రాజెక్టులను ఎన్ పీజీ యంత్రాంగం పరిశీలించింది. ఈ 352 ప్రాజెక్టులలో 201 మాత్రమే మంజూరయ్యాయి. వీటిలో ప్రస్తుతం 167 ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి. "2022–23 సంవత్సరానికి రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ పథకం" లోని రెండో భాగం (పీఎం గతిశక్తికి సంబంధించిన ఖర్చుల కోసం) కింద కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన వ్యయ విభాగం రూ.5,000 కోట్లను కేటాయించింది. ఈ నిధులను రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో పంపిణీ చేస్తున్నారు. ఈ పథకం కింద ఆమోదించిన రాష్ట్రాల ప్రాజెక్టుల వివరాలు, కేటాయించిన నిధుల వివరాలు కూడా అందించారు.

పీఎం గతిశక్తి విధానం ద్వారా రూ.150 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వ్యయంతో ప్రణాళికతో రూపొందించిన, పరిశీలించిన మౌలిక సదుపా యాల ప్రాజెక్టులు సహా కేంద్ర రంగ ప్రాజెక్టుల పర్యవేక్షణను 'గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ' నిర్వహిస్తుంది. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, అంచనా వ్యయం పెరగడం వంటి పూర్తి వివరాలతో కూడిన వివరణాత్మక నివేదిక జూలై 2025 నుంచి పీఏఐఎంఏఎన్ఏ పోర్టల్ లో ప్రచురితమవుతుంది.

ప్రాజెక్టుల పురోగతిని దశల వారీగా పర్యవేక్షించడం, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, భారీ స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల (రూ. 500 కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయం కలిగినవి) అమలును వేగవంతం చేసే లక్ష్యంతో ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (పీఎంజీ) అనే సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేశారు. సమస్యల పరిష్కారం, నిర్ణయాల వేగం పెంచేందుకు పీఎంజీ ప్రత్యేకమైన అయిదు అంచెల ఉన్నత స్థాయి విధానాన్ని అమలు చేసింది. దీని ద్వారా సమస్యలను సంబంధిత మంత్రిత్వ శాఖ స్థాయిలో పరిష్కరించడం నుంచి మొదలుకొని అత్యంత సంక్లిష్ట మైన సమస్యల పరిష్కారం కోసం ప్రగతి (ప్రో–యాక్టివ్ గవరెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెం టేషన్) ఫోరం వరకు విస్తరించింది.




# కేతకీలో పండుగ శోభ.. నేటి నుంచి మహా శివరాత్రి నవహిక్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం..!





మెదక్, ఫిబ్రవరి 10: అష్టతీర్థముల సంగమం, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి నవాహిక్నిక బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. నిత్యపూజా కార్యక్రమాలతో, భక్తుల రద్దీతో ఆలయమంతా సందడిగా మారనుంది. జాతరను పునస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్‌దీప కాంతులతతో అలంకరించారు.

మహా శివరాత్రి నవహిక్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అంకురార్పణం, ద్వజారోహణం, విఙ్ఞేశ్వరపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శిఖర పూజ, రాత్రి పల్లకిసేవ, భజనలు నిర్వహిస్తారు. గురువారం, శుక్రవారం, శనివారం కూడా ఇవే సేవలు కొనసాగుతాయి. ఆదివారం మహాశివరాత్రిని పునస్కరించుకొని.. అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, స్వామివారికి అభిషేకం, రాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం జరిపిస్తారు. రుత్విక్కరణ, పల్లకి సేవ, భజనలతో ఆ రోజంతా శోభాయమానంగా ఉంటుంది.

సోమవారం స్వామివారికి రుద్రభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రస్వాహకార హోమము, నవగ్రహ శాంతి హోమం, సాయంత్రం నందివాహన సేవ, రాత్రి అగ్నిగుండం పూజ, అగ్ని ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు ఉంటాయి. మంగళవారం ఉదయం అగ్నిగుండం, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రస్వాహకార హోమం, పూర్ణాహుతి, సాయంత్రం పార్వతీ సంగమేశ్వర స్వామి కల్యాణోత్సవం, రాత్రి స్వామివారికి విమాన రథోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తారు. బుధవారం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రికి పల్లకిసేవ, భజనలు.. మరునటి రోజుస్వామివారికి రుద్రభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లక్షబిల్వార్చన, అన్నదానం, రాత్రికి పల్లకి సేవతో జాతర ముగుస్తుంది.

**జిల్లాలోనే అతిపెద్ద ఆలయం**

సంగారెడ్డి అతిపెద్దది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ముంబైకి వెళ్లే 65వ జాతీయ రహదారిపైనున్న జహీరాబాద్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో కేతకీ ఆలయం ఉంటుంది. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో స్నానాలు చేస్తే శుభం జరుగుతుందని భక్తుల నమ్మకం. ఈ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

# మహబూబ్‌నగర్‌కు భారీగా నగదు తనిఖీ



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా నారాయణపేట పట్టణంలోని ఎర్ర గుట్ట చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ షఫీ అనే వ్యక్తి యాదగిరి నుండి మహబూబ్‌నగర్‌కు రూ.1,17,000 నగదును తీసుకెళ్తుండగా ఎర్ర గుట్ట చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహించాం. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి సరైన బిల్లులు లేదా ఆధారాలు చూపించలేకపోయాడని.. దీంతో ఎన్నికల నిబంధనల మేరకు ఆ నగదును స్వాధీనం చేసుకొని, తదుపరి చర్యల నిమిత్తం గ్రీవియన్స్ కమిటీకి అప్పగించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ఎవరైనా అనుమానాస్పద నగదు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు.

## న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో రేపు ఔషధ మొక్కలపై చింతన్ శిబిర్‌ను నిర్వహిస్తున్న జాతీయ ఔషధ మొక్కల బోర్డు

# చింతన్ శిబిర్‌ను ప్రారంభించనున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: 2026, ఫిబ్రవరి 11న ఔషధ మొక్కలపై చింతన్ శిబిర్‌ను ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధి లోని జాతీయ ఔషధ మొక్కల బోర్డు (ఎన్ఎంపీబీ) నిర్వహించనుంది. దీనిలో దేశంలో ఔషధ మొక్కల రంగానికి సంబంధించిన ముఖ్యమైన విధానాలు, పరిశోధన, అమలులో ఎదురవుతున్న సమస్యలపై దీనిలో చర్చిస్తారు.

ప్రారంభ కార్యక్రమానికి ఆయుష్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా గౌరవ అతిథిగా హాజరవుతారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఆర్థిక సలహాదారు శ్రీ హ్వ్యేద అబ్బాస్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారు.

చింతన్ శిబిర్ అనంతరం బోర్డు సమావేశం జరుగుతుంది. ఆ తర్వాత జరిగే టెక్నికల్ సెషన్లు, ప్యానెల్ చర్చల్లో నిపుణులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. ఔషధ మొక్కల రంగంలో విధాన నియమాలను బలోపేతం చేయడం.. పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అమల్లో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంపై చర్చల్లో ప్రధాన దృష్టి సారిస్తారు.

విధానపరమైన జోక్యం, పరిశోధనా పురోగతులు, సంస్థాగత బలోపేతానికి ఔషధ మొక్కల రంగంలో ప్రధాన విభాగాలను గుర్తించేలా వ్యూహాత్మక దిశను చింతన్ శిబిర్ అందిస్తుందని భావిస్తున్నారు. సాగు విస్తరణకు, పరిరక్షణకు, విలువ జోడింపునకు, మార్కెట్ అనుసంధానాన్ని అందించే సమన్వయపూర్వకమైన, భవిష్యత్తుకు తగిన ప్రణాళికను రూపొందించడంలో ఈ చర్చల ఫలితాలు సహకరిస్తాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com